అనుదినం జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
మంగళవారం 23 మే 2023

విత్తన, ఎరువుల దుకాణాల తనిఖీ

నవతెలంగాణ-ముధోల్

నియోజకవర్గ కేంద్రమైన ముధోల్‌లోని విత్తన, ఎరువుల దుకాణాలను సోమవారం వ్యవసాయ శాఖ ఏడీఏ వీణ, ఏవో అజ్మీర భాస్కర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దుకాణంలో నిల్వ ఉన్న విత్తనాలు, ఎరువులను పరిశీలించారు. స్టాక్ రిజిస్టర్, బిల్లు బుక్‌లను పరిశీలించి పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడారు. దుకాణదారులు ఈ ఖరీఫ్ సీజన్‌లో రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు విక్రయించాలని సూచించారు. విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసిన రైతులకు తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ప్రమాదకరంగా విద్యుత్ లైన్లు

నవతెలంగాణ-ఖానాపూర్

పట్టణంలోని శ్రీరామ్‌నగర్ కాలనీ నాలుగో వార్డులో విద్యుత్ వైర్లు ప్రమాదకరంగా ఉన్నాయని, వాటిని సరి చేయాలని స్థానికులు కోరుతున్నారు. గత సంవత్సరం గాలి వానకు విద్యుత్ స్తంభం నేలకు ఒరిగి ప్రమాదకరంగా మారింది. వచ్చే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని సంబంధిత అధికారులు విద్యుత్ వైర్లను సరి చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు.



కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి



నవతెలంగాణ - బెజ్జూర్

తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన కంటి వెలుగు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అన్నారు. సోమవారం మండలంలోని బారెగూడెం గ్రామంలో నిర్వహిస్తున్న కంటి వెలుగు శిబిరాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చీకట్ల నుండి వెలుగులు నింపేందుకే ప్రభుత్వం కంటి వెలుగు కార్యక్రమం ప్రవేశపెట్టిందని, కంటి సమస్యలున్న ప్రతి ఒక్కరు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కంటి పరీక్షలు చేయించుకున్న వారికి ప్రభుత్వం కంటి అద్దాలు ఉచితంగా అందజేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ సాయికృష్ణ, సర్పంచ్ రేణికుంట్ల సంతోష్, మండల కోఆప్షన్ సభ్యుడు బశరత్‌ఖాన్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సింగరేణి ఆధ్వర్యంలో క్రీడా, ముగ్గుల పోటీలు

నవతెలంగాణ- నస్పూర్

తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మహిళలకు, పిల్లలకు వివిధ క్రీడా, ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నామని గెలుపొందిన వారికి జూన్ 2వ తేదీన తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో బహుమతులు ప్రధానం చేస్తున్నట్లు శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ బి. సంజీవరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మే 26వ తేదీన సాయంత్రం ఐదు గంటల నుండి నస్పూర్ కాలనీలో మనోరంజన్ సముదాయంలో వివిధ అంశాలలో మహిళలకు, పిల్లలకు ఆటల పోటీలు, 27వ తేదీన సిఈఆర్ క్లబ్ ప్రగతి స్టేడియం శ్రీరాంపూర్ కాలనీలో సాయంత్రం 5 గంటల నుండి ముగ్గుల పోటీలు, ఎస్ సి ఓ ఏ క్లబ్ నందు ఆటల పోటీలు, 29వ తేదీన సాయంత్రం నాలుగు గంటల నుండి జనరల్ మేనేజర్ కార్యాలయంలో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులకు ఆటల పోటీలు ఉంటాయన్నారు. నస్పూర్ కాలనీ సముదాయంలో ముగ్గుల పోటీలు, 30వ తేదీన సిఆర్ క్లబ్ ప్రగతి స్టేడియం శ్రీరాంపూర్ కాలనీలో సాయంత్రం ఐదు గంటల నుండి మహిళలకు, పిల్లలకు ఆటల పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం రోజున ఉదయం 8 గంటలకు నస్పూర్ కాలనీలోని తెలంగాణ తల్లి విగ్రహానికి పూలదండ అలంకరణ, జనరల్ మేనేజర్ కార్యాలయం వరకు తెలంగాణ ర్యాలీ నిర్వహించినట్లు పేర్కొన్నారు. సింగరేణీయులు, వారి కుటుంబ సభ్యులు, సేవ, సింగరేణి సేవా సమితి సభ్యులు, పురపాలక ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

స్టాఫ్ నర్సులకు ఉద్యోగ భద్రత కల్పించాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌అర్బన్

ఆరు సంవత్సరాల నుండి వివిధ పిహెచ్‌సిలు, సిహెచ్‌సిలలో విధులు నిర్వర్తిస్తున్న స్టాఫ్ నర్సులకు వెంటనే ఉద్యోగ భద్రత కల్పించాలని కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటి కోరారు. ఈ మేరకు సోమవారం ప్రజా ఫిర్యాదుల విభాగంలో జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టాఫ్ నర్సులకు ఏడు నెలల పెండింగ్ వేతనాలను ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించి, ఐడి నెంబర్‌లను ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. అనేక సంవత్సరాల నుండి స్టాఫ్ నర్సుల శ్రమను దోచుకొని జిల్లా అధికారులు, నేషనల్ హెల్త్ మిషన్ కమిషనర్, డైరెక్టర్ ఆఫ్ హెల్త్ అధికారులు పట్టించుకోకపోవడం వల్ల స్టాఫ్ నర్సులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సదరు విషయమై పలుమార్లు వారిని కలిసిన ఇప్పటికీ ఫలితం లేదని అసహనం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ చొరవ చూపి స్టాఫ్ నర్స్‌లకు ఉద్యోగ భద్రత కల్పించి యథావిధిగా వారి స్థానాల్లో కొనసాగేలా పోస్టింగులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలకు శ్రీకారం చుడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో స్టాఫ్ నర్సులు సోయం నాగేందర్, అశ్విత, ఉమలత, హైమ పాల్గొన్నారు.

పోచమ్మ దేవాలయం నిర్మాణానికి అదనపు నిధులు

నవతెలంగాణ- ఆసిఫాబాద్ రూరల్

జిల్లాలోని వాంకిడి మండల కేంద్రంలో నాలుగు వరసల రహదారి నిర్మాణంలో కోల్పోయిన పోచమ్మ దేవాలయం నూతనంగా నిర్మించేందుకు అదనపు నిధుల మంజూరుకు కృషి చేస్తానని జిల్లా కలెక్టర్ బొర్కడే హేమంత్ అన్నారు. సోమవారం జిల్లా అదనపు కలెక్టర్ రాజేశం, ఆర్డీఓ రాజేశ్వర్ తో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగు వరుసల రహదారి నిర్మాణంలో పోయిన పోచమ్మ దేవాలయం నూతన నిర్మాణానికి గతంలో మంజూరు చేసిన నిధులు సరిపోనందున ప్రజా ప్రతినిధులు, దేవస్థాన కమిటీ చేసిన ప్రతిపాదన మేరకు అదనంగా నిధుల మంజూరుకు కృషి చేస్తానని తెలిపారు. నాలుగు వరసల రహదారి నిర్మాణం పూర్తి చేసేందుకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్పిటిసి అజయ్ కుమార్, సర్పంచ్ బండి తుకారం, సింగిల్ విండో చైర్మన్ పెంటయ్య, దేవస్థాన కమిటీ అధ్యక్షులు మహాజన్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

పర్యావరణహిత జీవన విధానంపై అవగాహన

జన్నారం : పర్యావరణహిత జీవవిధానంపై కవ్వాల్ టైగర్ జోన్‌లోని జన్నారం అటవీ డివిజన్ పరిధిలోని ఇందన్‌పల్లి రేంజ్‌లో ఎఫ్ఆర్ఓ అఫీస్‌ఉద్దీన్ ఆధ్వర్యంలో సోమవారం అధికారులు గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎఫ్ఆర్ఓ మాట్లాడుతూ ప్లాస్టిక్ అధికంగా వాడడం వల్ల వర్షపు నీరు భూమిలో ఇంకకపోవడంతో భూగర్భజలాలు త్వరగా అడుగంటి పోతున్నాయని తెలిపారు. ప్లాసిక్ వాడకాన్ని తగ్గించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇందన్‌పల్లి రేంజ్ అటవీ అధికారులు, ఆయా గ్రామాల సర్పంచులు, ఉప సర్పంచులు పాల్గొన్నారు.

చింతగూడలో..

జన్నారం అటవీ డివిజన్ పరిధిలోని చింతగూడ గ్రామంలో పర్యావరణ జీవ విధానంపై ఆయా గ్రామాల ప్రజలకు అవగాహన కల్పించారు. డిఆర్ఓ శ్రీరాం నాయక్, ఎఫ్ఎస్ఓ శివకృష్ణ, ఎఫ్‌బిఓలు, సర్పంచ్ ఎంపీటీసీ ఉపసర్పంచ్ ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

రోడ్డుపై చెత్త వేస్తే జరిమానా

తాండూర్ : రోడ్లపై చెత్త వేసిన దుకాణదారులకు జరిమానా విధించాలని ఎంపీఓ సత్యనారాయణ సూచించారు. సోమవారం తాండూరు పంచాయతీలో పలువురు దుకాణదారులకు జరిమాన విధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామపంచాయతీ అధికారులు పారిశుధ్యంపై శ్రద్ధ వహించాలన్నారు. దుకాణదారులే కాకుండా నివాసగృహాల వారు కూడా రోడ్లపై చెత్తను వేయకూడదని సూచించారు. బహిరంగ మల విసర్జన చేయరాదని స్పష్టం చేశారు. పంచాయతీ కార్యదర్శి తపాస్ ఉన్నారు.

కేజీబీవీ, యుఆర్ఎస్ సిబ్బంది సమస్యలు పరిష్కరించాలి

- ఆదిలాబాద్, ఆసిఫాబాద్ కలెక్టరేట్ల ఎదుట టీఎస్‌యూటీఎఫ్ ధర్నాలు



నవతెలంగాణ-ఆసిఫాబాద్, ఆదిలాబాద్‌అర్బన్

కస్తూర్బా గాంధీ విద్యాలయాలు, అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలల్లో పనిచేస్తున్న సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని టిఎస్‌యుటిఎఫ్ జిల్లా అధ్యక్షురాలు వైద్య శాంతికుమారి డిమాండ్ చేశారు. కలెక్టరేట్ ఎదుట జిల్లా ప్రధాన కార్యదర్శి సోయం ఇందురావు అధ్యక్షతన నిర్వహించిన ధర్నాలో ఆమె మాట్లాడారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్న సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం కెజిబివి, యుఆర్ఎస్ ఉద్యోగులందరికీ వారు చేస్తున్న పోస్టుకు కనీస వేతనం(బేసిక్ పే) చెల్లించాలన్నారు. ఎస్ఓను ప్రిన్సిపాల్‌గా, పిజిసిఆర్టీలను జెఎల్స్‌గా, సిఆర్టీలను స్కూల్ అసిస్టెంట్స్‌గా, పిఈటిలను పీడీలుగా గుర్తించి ఆ పోస్ట్ బేసిక్ పేను ఇవ్వాలన్నారు. హాస్టల్ నిర్వహణ కోసం కేర్‌టేకర్‌ను నియమించాలని, సిఆర్టీలకు నైట్ డ్యూటీల నుండి మినహాయింపు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పిఆర్సీ సిఫారసు చేసిన విధంగా కెజిబివి కాంట్రాక్టు ఉద్యోగులకు ప్రతి సంవత్సరం రూ.1000 ఇంక్రిమెంట్ ఇవ్వాలని, నెలకు రెండు సిఎల్స్ అనే పరిమితిని ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. సిబ్బందికి వసతి సౌకర్యం కల్పించాలని, ఉద్యోగులను వెంటనే రెగ్యులర్ చేయాలన్నారు. పార్ట్‌టైం సిబ్బందిని పూర్తి కాలం పని చేయిస్తున్నందున వారిని సిఆర్టీలుగా మార్చి బేసిక్ పే ఇవ్వాలన్నారు. గురుకులాలతో సమానంగా మెస్ చార్జీలను పెంచడంతోపాటు ఆదర్శ పాఠశాల హాస్టల్ నిర్వహణ బాధ్యత నుండి ఎస్ఓలను తప్పించాలన్నారు. ఉన్నతీకరించబడిన పాఠశాలలో అదనపు సిబ్బందిని నియమించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం సమస్యలు పరిష్కారం కోసం చర్యలు తీసుకోకుంటే భవిష్యత్తులో ఆందోళన ఉధృతం చేయాల్సి ఉంటుందని హెచ్చరించారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సోయం ఇందురావు, హేమంత్ షిండే, కాంపెల్లి ఊశన్న, రమేష్, సుభాష్, ధర్మయ్య, కేజీబీవీ ప్రత్యేక అధికారి రమాదేవి, కేజీబీవీ ఉపాధ్యాయులు రజని, స్నేహిత, హారిక, అన్నపూర్ణ, రమాదేవి, శరణ్య, సరస్వతి, కేజీబీవీ బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు. కేజీబీవీ, యుఆర్ఎస్ సిబ్బందికి మద్దతుగా యుటిఎఫ్ చేస్తున్న ధర్నాకు సిఐటియు నాయకులు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు అల్లూరి లోకేష్, నాయకులు కృష్ణమాచారి, రాజేందర్ పాల్గొన్నారు. ధర్నాలో ప్లకార్డుతో చిన్నారి తల్లితో కలిసి పాల్గొనడం చూపరులను ఆలోచింపజేసింది.

ఆదిలాబాద్‌లో..

కేజీబీవీ, యు ఆర్ ఎస్ లలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు ఇతర సిబ్బంది సమస్యలను వెంటనే పరిష్కరించాలని టీఎస్ యుటిఎఫ్ అధ్యక్ష కార్యదర్శులు ఏ. స్వామి, వి. అశోక్ అన్నారు. ఈ మేరకు సోమవారం ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనాథ, వెనుకబడిన బాలికలకు విద్యను అందించడం కోసం 2004 సంవత్సరం నుండి మహిళా సిబ్బంది ఎంతో శ్రమించి అద్భుత ఫలితాలు సాధించారని అన్నారు. బాలిక విద్యను ప్రోత్సహించడంలో ఇతర పాఠశాలలతో సమానంగా కేజీబీవీలను నిలిపారని గుర్తు చేశారు. కేజీబీవీ లలో పనిచేస్తున్న బోధన బోధనేతర సిబ్బంది సేవలను సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం చెల్లించాలని ఇతర పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని కోరారు. కేజీబీవీ సిబ్బంది సమస్యలను వెంటనే పరిష్కరించాలని లేనిపక్షంలో జూన్ 8న హైదరాబాదులో ధర్నా చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టీఎస్ యుటిఎఫ్ కోశాధికారి కే. కిష్టన్న, నాయకులు కే. శ్రీనివాస్, ఏ. స్వరూపారాణి, ఎం. శ్యామ్, ఈ. శివన్న, కే. శంకర్, రజిని, ఎం .మహేందర్, డి .అశోక్, ఎం. జయకర్, కే. రాజశేఖర్, కేజీబీవీ ఎస్ ఓ లు, సిఆర్టి లు ,ఉద్యోగులు పాల్గొన్నారు.





అనుమతిలేని విత్తనాలు విక్రయిస్తే లైసెన్సు రద్దు

- వ్యవసాయ శాఖ హైదరాబాద్ కమిషనరేట్ ఏడీఏ చంద్రకళ

నవతెలంగాణ - కాగజ్‌నగర్ రూరల్

అనుమతిలేని విత్తనాలు విక్రయిస్తే షాపుల లైసెన్సు రద్దు చేస్తామని వ్యవసాయశాఖ హైదరాబాద్ కమిషనరేట్ ఏడీఏ చంద్రకళ హెచ్చరించారు. సోమవారం పలు విత్తన దుకాణాలు, ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసులను టాస్క్‌ఫోర్స్, వ్యవసాయశాఖ అధికారులు సంయుక్తంగా తనిఖీలు చేశారు. కొన్ని విత్తన కంపెనీల నమునాలను సేకరించి హెర్బిసైడ్ టాలరెన్స్ పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా చంద్రకళ మాట్లాడుతూ అనుమతి లేని విత్తనాలు ఎవరైనా విక్రయిస్తే లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు. రైతులకు విత్తనాలు విక్రయించే సమయంలో రశీదుపై విత్తనాలకు సంబంధించిన పూర్తి వివరాలను నమోదు చేయాలని సూచించారు. విక్రయం, నిల్వ వివరాలు సైతం స్పష్టంగా ఉండాలన్నారు. ఎవరైనా గ్లేసిల్ విత్తనాలు విక్రయిస్తే వ్యవసాయశాఖకుగానీ, పోలీస్



శాఖకుగానీ సమాచారం ఇవ్వాలని తెలిపారు. డీలర్లు తప్పకుండా స్టాక్ బోర్డు రాయాలని, ఉన్న స్టాక్ వివరాలు రైతులకు కనిపించేలా ఉంచాలని సూచించారు. గ్లైసిల్ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్య తప్పవని హెచ్చరించారు. రైతులు కోరిన విత్తనాలను మాత్రమే ఇవ్వాలని, నాసిరకం విత్తనాలు విక్రయించి అనూయకపు రైతులను ఇబ్బందులకు గురి చేయవద్దని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు, టాస్క్‌ఫోర్స్ ఎస్సై సందీప్, కాగజ్‌నగర్ ఏడీఏ మనోహర్, ఏఓ రామకృష్ణ, సీడ్ సర్టిఫికేషన్ అధికారి దుర్గేష్, డీలర్లు పాల్గొన్నారు.



వాంకిడి : మండల కేంద్రంలోని ఫర్టిలైజర్ దుకాణాలను సోమవారం టాస్క్‌ఫోర్స్ అధికారులు తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా దుకాణాల్లో గల అన్ని రికార్డులను తనిఖీ చేయడంతో పాటు వివరాలను సేకరించారు. దుకాణాల్లో నకిలీ విత్తనాలు, ఎరువులు అమ్మినట్లయితే చర్యలు తీసుకుంటామని టాస్క్‌ఫోర్స్ ఏడీఏ చంద్రకళ అన్నారు. రైతులు దుకాణాల్లో ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేసినప్పుడు తప్పనిసరిగా రశీదు తీసుకోవాలని తెలిపారు. ఎలాంటి సమస్యలున్నా రైతులు వ్యవసాయాధికారులను సంప్రదించి సలహాలు, సూచనలు తీసుకోవాలన్నారు. ఆమెతో పాటు ఎస్ఐ సందీప్, డీఏఓ శ్రీనివాస్, డీఏ మిలింద్‌కుమార్, ఖాదర్‌హుస్సేన్, వ్యవసాయ సిబ్బంది ఉన్నారు.

ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కార్మికుల సంబరాలు

నవతెలంగాణ-రామకృష్ణాపూర్

ఆర్‌కె ఓసి, సిహెచ్‌పి గనులలో 11వ వేజ్‌బోర్డు పరిష్కారం అయినందుకు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో టపాకాయలు పేల్చి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు ఎండీ అక్బర్ అలీ మాట్లాడారు. 11వ వేజ్ బోర్డ్ పరిష్కారంలో ఏఐటీయూసీ కీలకపాత్ర పోషించిందన్నారు. అన్ని కార్మిక సంఘాలను కలుపుకొని 19శాతం కనీస వేతనం, 25శాతం అలవెన్సులు సాధించడం ఒక్క బొగ్గు గని కార్మికులకే సాధ్యమైందని పేర్కొన్నారు. పెరిగిన వేతనాలు జూలై ఒకటవ తేది నుండి అమలవుతాయని, 23నెలల ఎరియర్స్ త్వరలో చెల్లించే విధంగా పోరాటాలు చేసి సాధించుకోవాలి తెలిపారు. స్టాండరైజేషన్ కమిటీ నిర్ణయం ప్రకారం రావాల్సిన మిగతా హక్కులను సాధించుకోవాలని, కాంట్రాక్ట్ విధానాలకు వ్యతిరేకంగా కాంట్రాక్టు కార్మికుల వేతనల కొరకు కార్మిక చట్టాలను కాపాడుకోవడానికి కలిసి పని చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పిట్ కార్యదర్శులు ఏ. ఆంజనేయులు, సురమల్ల



వినయ్‌కుమార్, ఆర్.సంజీవ్, సంపత్, రామకృష్ణ, శ్రీనివాస్, రాజు, వంగ రాజేశ్వర్‌రావు, మైనింగ్ స్టాఫ్ నాయకులు వీరయ్య, దేవసహాయం పాల్గొన్నారు.

రక్తదాతలను ప్రోత్సహించండి

నవతెలంగాణ-జైపూర్

మండల కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేస్తున్న మెగా రక్తదాన శిబిరంలో గ్రామ పంచాయతీల వారీగా దాతలను ప్రోత్సహించాలని ఎంపీడీఓ సత్యనారాయణ ఒక ప్రకటనలో కోరారు. తహసీల్దార్ కార్యాలయం ఎదుట రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఎంపీపీ, జెడ్పీటీసీలతో పాటు గ్రామ పంచాయతీ సర్పంచులు, కార్యదర్శులు మెగా రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయడానికి సహకారం అందించాలని కోరారు.

ఆశాలకు రూ.18వేల వేతనం చెల్లించాలి



నవతెలంగాణ - కాగజ్‌నగర్ రూరల్

ఆశా వర్కర్లకు రూ.18,000 వేతనం చెల్లించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ముంజం ఆనంద్ కోరారు. తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్(సీఐటీయు) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం కాగజ్‌నగర్ సీహెచ్ సీ, ఈజ్‌గాం పీహెచ్‌సీలో డిప్యూటీ డీఎంహెచ్ఓ సీతారాంకు వినతి పత్రాలు అందించారు. ముంజం ఆనంద్ మాట్లాడుతూ గతంతో పోలిస్తే ఆశా వర్కర్లకు పనిభారం విపరీతంగా పెరిగిందని, పారితోషికాలు లేని అనేక పనులను ప్రభుత్వం ఆశాలతో చేయిస్తోందని పేర్కొన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయని, ఈ పరిస్థితిలో వచ్చే పారితోషికాలు సరిపోక ఆశా వర్కర్లు అనేక ఇబ్బందులకు గురౌతున్నారని వాపోయారు. గతంలో ఇచ్చినట్లు ఆశాలకు ప్రతినెలా ఒకటి లేదా రెండవ తేదీల్లో పారితోషికాలు చెల్లించాలని, పారితోషికం లేని అదనపు పనులు ఆశాలతో చేయించకూడదని, టిబి, లెప్రసీ, కంటి వెలుగు తదితర పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. జాబ్‌చార్ట్ విడుదల చేసి 2021 జూలై నుండి డిసెంబర్ వరకు 6 నెలల పిఆర్సి ఎరియర్స్ వెంటనే చెల్లించాలని, కేంద్రం చెల్లించిన కరోనా రిస్క్ అలవెన్స్ నెలకు వెయ్యి చొప్పున 16 నెలల బకాయి డబ్బులు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి నగరం పద్మ, సురేఖ, గీత మండల్, జల్పన, భాగ్య, మీనతి, శారద, లక్ష్మి పాల్గొన్నారు.

అటవీ అధికారులు విధించిన ఆంక్షలు సడలించాలి



నవతెలంగాణ-జన్నారం

కవ్వాల్ టైగర్ జోన్ లో వాహనాలకు అటవీ అధికారులు విధించిన ఆంక్షలు సడలించాలని, మండల సర్పంచుల ఫోరం ఎంపీటీసీల ఫోరం ఇతర ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో సోమవారం అటవీ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డికి, ఎమ్మెల్యే రేఖానాయక్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అటవీ శాఖ ఆంక్షలు విధించడంతో లక్ష టిపేట, దండేపల్లి, జన్నారం, దస్తురాబాద్, ఉట్నూర్, ఇంద్రవెల్లి, కడెం, ఖానాపూర్ మండలాలకు రవాణా వ్యవస్థ స్తంభించి వ్యాపారస్తులకు తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉందన్నారు. దీంతో ఇక్కడ అభివృద్ధి కుంటుపడుతుందన్నారు. ఈ ఆంక్షలు సడలించి వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలగకుండా చూడాలని కోరుతున్నామన్నారు. దీనికి సానుకూలంగా స్పందించిన పీసీసీఎఫ్ ఆంక్షలు సహడలించడానికి హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ల సంఘం అధ్యక్షుడు జాడి గంగాధర్, ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు మమ్మద్ రియాజుద్దీన్, వైస్ ఎంపీపీ సుతారి వినయ్ కుమార్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గోట్ల రాజేష్ యాదవ్, టిఆర్ఎస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి సులువా జనార్దన్, మోసిన్, ఇతర మండల ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

కెనాల్‌లో పడి మహిళ మృతి



వాంకిడి : కెనాల్‌లో పడి మహిళ మృతిచెందిన సంఘటన మండలంలో సోమవారం చోటుచేసుకుంది. సీఐ శ్రీనివాస్, ఎస్ఐ సాగర్ తెలిపిన వివరాల ప్రకారం..చిన్న వాంకిడి గ్రామానికి చెందిన ఆదె మోతిరాంకు ఇద్దరు భార్యలు. చిన్న భార్యకు ఇద్దరు కుమారులు, పెద్ద భార్యకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పెద్ద భార్య పెద్ద కూతురైన వడాయి సక్రుబాయి(28) వ్యవసాయం చేసుకుంటూ జీవనం కొనసాగిస్తోంది. నవెగూడ గ్రామానికి చెందిన ఇంద్రజిత్‌ను 9ఏండ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకుంది. మూడేండ్ల క్రితం బాబు పుట్టి చనిపోయాడు. అప్పటి నుండి వీరికి పిల్లలు కలుగడం లేదు. పిల్లల కోసం మూడు నెలల క్రితం నుండి ప్రతి శనివారం, సోమవారం మండలంలోని బెండారా గ్రామ సమీపంలో గల శివుని దేవాలయానికి వెళ్తున్నారు. ఎప్పటిలాగానే సోమవారం ఉదయం భార్యభర్తలు మోటార్ సైకిల్(టీఎస్ 20 టి 3479)పై లేండిగూడ నుండి బెండారాకు వెళ్తున్నారు. మొకాసిగూడ, సరంగి గ్రామాల మధ్యలో ఇంద్రజిత్ మోటార్ సైకిల్‌ను అతివేగంగా, అజాగ్రత్తగా నడపడంతో అదుపుతప్పి కెనాల్‌లో పడిపోయారు. అందులో నాచు ఎక్కువగా ఉండడంతో సక్రుబాయి మృతి చెందింది. ఇంద్రజిత్ ఈదుకుంటూ బయటకు వచ్చాడు. మోటార్‌సైకిల్‌ను అజాగ్రత్తగా నడిపిన అల్లుడు ఇంద్రజిత్‌పై చర్యలు తీసుకోవాలని మహిళ తల్లిదండ్రులు తెలిపారు. తండ్రి మోతిరాం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అనారోగ్యంతో గోదాం ఇన్‌చార్జి మృతి



బెజ్జూర్: మండల కేంద్రంలోని జీసీసీ భారత్ గ్యాస్ గోదాం ఇన్‌చార్జిగా విధులు నిర్వహిస్తున్న పాయం జగన్నాథరావు(59) అనారోగ్యంతో మృతి చెందినట్లు ఎస్ఐ వెంకటేశ్ తెలిపారు. మూడేండ్ల నుండి బెజ్జూర్‌లో ఓ ఇంట్లో అద్దెకు ఉంటూ గోదాం ఇన్‌చార్జిగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఆదివారం రాత్రి ఇరుగుపొరుగు వారికి దుర్వాసన రావడంతో పోలీసులకు సమాచారం అందించారు. కుళ్లిపోయిన స్థితిలో శవమై కనిపించాడు. ఈ విషయాన్ని కుటుంబీకులకు పోలీసులు సమాచారం అందజేయగా సోమవారం బెజ్జూర్‌కు చేరుకున్నారు. మృతుడికి కొన్ని రోజులుగా అనారోగ్య సమస్యలతో పాటు జ్వరంతో బాధపడుతున్నాడు. దీనికి తోడు వడదెబ్బ కూడా తగిలి ఉండవచ్చని భావిస్తున్నారు. మృతుడి భార్య శశికళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు. మృతదేహానికి శవ పంచనామా నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

రైలు నుండి పడి వ్యక్తి మృతి

కాగజ్‌నగర్ రూరల్ : రాళ్లపేట - సిర్పూర్ కాగజ్‌నగర్ రైల్వే స్టేషన్ల మధ్య వంజీరి రైల్వే గేటు సమీపంలో మంచిర్యాల నుండి బల్లార్ష వైపు వెళ్లే గుర్తు తెలియని రైలు బండి నుండి పడి వ్యక్తి మృతి చెందినట్లు రైల్వే హెడ్ కానిస్టేబుల్ సురేష్ గౌడ్ తెలిపారు. మృతుడికి సుమారు 35 సంవత్సరాల వయసు ఉంటుందని, ఎలాంటి ఆధారాలు లభించలేదని తెలిపారు. నీలి రంగు ఫుల్ షర్ట్, చాక్లెట్ కలర్ ప్యాంటు ధరించి ఉన్నాడని, కుడి చేతికి తెల్లని కడియం, మెడలో స్టీల్ చైన్, కుడి చేతిపై మరియమ్మ అని కన్నడంలో రాసి ఉందని తెలిపారు. మృతదేహాన్ని సిర్పూర్(టి) ప్రభుత్వ ఆసుపత్రి మార్చురిలో భద్రపరచడం జరిగిందని, వ్యక్తి ఆచూకి ఎవరికైనా తెలిస్తే సెల్ : 9490871784, 9440700038 లకు సమాచారం ఇవ్వాలని కోరారు.

కడెం ప్రాజెక్టు మరమ్మతు పనుల పరిశీలన

నవతెలంగాణ-కడెం



కడెం ప్రాజెక్టు కౌంటర్ పేట్ల మరమ్మత్తులు పనులు ప్రాజెక్టు సివిల్ పనులను ఈఎన్‌సీ ఎం.నాగేంద్రరావు పరిశీలించి, పలు సూచనలు చేశారు. జూన్ 10వ తేదీ వరకు కౌంటర్ గేట్ల మరమ్మతుల పనులు పూర్తి చేస్తామని అన్నారు. సివిల్ పనులను ఎప్పటికప్పుడు చేపడుతున్నమని అన్నారు. గత వర్షాకాలం వరదలకు దెబ్బతిన్న ప్రాజెక్ట్ సేఫ్టీ పనులను వేగంగా పూర్తి చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ అధికారులు శ్రీనివాస్, సుశీల్ కుమార్, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

నవతెలంగాణ-లక్ష్మణచాంద

మండలకేంద్రంలోని రెండో నెంబర్ రేషన్ షాప్‌లో సమయానికి రేషన్ బియ్యం ఇవ్వడం లేదని సోమవారం లబ్ధిదారులు ఆందోళన చేశారు. సరిపడా బియ్యం నిల్వలు లేకుండా నిర్వహిస్తున్నారని నిరసన వ్యక్తం చేశారు. విషయం తెలిసిన వెంటనే ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ హనుమాన్ సంఘటన స్థలానికి చేరుకొని లబ్ధిదారులతో మాట్లాడారు. రేషన్ షాప్‌లో తనిఖీలు నిర్వహించారు. విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని తెలిపారు. అప్పటి వరకు వేరొకరికి బాధ్యతలు అప్పగించినట్లు పేర్కొన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వెంట ఎస్సై రాహుల్ గైక్వాడ్, ఆర్ఐ దేవిక, రెవిన్యూ సిబ్బంది ఉన్నారు.

ఇంటింటా ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలి

నవతెలంగాణ-దిలావర్‌పూర్

మండల కేంద్రంలోని నూతన కాలనీల్లో ఇంకుడు గుంతలు ఏర్పాటుకు సోమవారం సర్పంచ్ వీరేష్ కుమార్ భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంట్లో నిర్మించుకునే ఇంకుడు గుంతలకు రూ.6 వేలు, కమ్యూనిటీ ఇంకుడు గుంతలకు రూ.14వేలు ప్రభుత్వం ఇవ్వడం జరుగుతుందని అన్నారు. ప్రతి ఇంటిలో ఇంకుడు గుంతలు నిర్మిస్తే నీటి ఎద్దడిని ఆపగలుగుతామని అన్నారు. గ్రామస్తులు ఇట్టి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ అజీజ్ ఖాన్, పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్, టీఏ రమణ, ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీనివాస్, ప్రవీణ్, విజయ్ రాజు, సంతోష్ పాల్గొన్నారు.

క్రీడా దుస్తులు అందజేసిన ఎంపీపీ

నవతెలంగాణ-లక్ష్మణచాంద

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సీఎం కప్ జిల్లా స్థాయి పోటీలలో పాల్గొనబోతున్న మండల క్రీడాకారులకు సోమవారం ఎంపీపీ అడ్వాల పద్మ రమేష్ స్వంత ఖర్చులతో రూ. 10వేల విలువ చేసే క్రీడా దుస్తులు అందజేశారు. క్రీడాకారులు రాణించి, మండలానికి వన్నె తేవాలని సూచించారు. తెలంగాణ ప్రభుత్వం క్రీడా రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు.

రైతులకు నాణ్యమైన విత్తనాలు అందజేయాలి

నవతెలంగాణ-ముథోల్

ముథోల్ వ్యవసాయ పరిశోధనా స్థానం, ఏరువాక కేంద్రంలో వర్షాకాలానికి సంబంధించిన కందులు, మినుము, సోయా విత్తనాలు రైతులకు అందుబాటులో ఉన్నాయని ప్రధాన శాస్త్రవేత్త డా.నర్సయ్య ఒక ప్రకటనలో తెలిపారు. కందులు డబ్ల్యూఆర్‌జి-97 రకం, హనుమా (టిడిఆర్ జి-4) రకం కందులు అందుబాటులో ఉన్నాయని ఒక సంచి నాలుగు కిలోల బరువు ఉంటుందని తెలిపారు. ఒక కందుల సంచి ధర రూ.520 ఉందని, అలాగే మినుములు పీయూ-31 రకం నాలుగు కిలోల సంచి ధర రూ.520, సోయా బాసర రకం 25 కిలోల సంచి ధర రూ 3వేలు ఉందని పేర్కొన్నారు. ఆసక్తి గల రైతులు పరిశోధన స్థానానికి నేరుగా వచ్చి తీసుకెళ్లాలని వివరించారు. దూర ప్రాంత రైతులు సంబంధిత వ్యవసాయ పరిశోధనా స్థానం బ్యాంకు ఖాతాలో డబ్బులు జమచేస్తే రైతులకు దగ్గరలో ఉన్న ట్రాన్స్‌పోర్టుకు విత్తనాలు పంపనున్నట్లు పేర్కొన్నారు. పూర్తి వివరాలకై శాస్త్రవేత్త డా.కె.విజయ్ కుమార్ ఫోన్ నంబర్ 7337399462 కు సంప్రదించాలని కోరారు.

యూనిఫామ్‌ల అందజేత

నవతెలంగాణ-కడెం

మండలంలోని అల్లంపెల్లి గ్రామపంచాయతీ పరిధిలోని చింతగూడ గ్రామంలోని అంగన్‌వాడి కేంద్రంలోని 32 మంది పేద గిరిజన పిల్లలకు యూనిఫాంలను తన కొడుకు జన్మదిన సందర్భంగా డీఆర్డీఓ విజయలక్ష్మీ అందజేశారు. అనంతరం గ్రామసభలో ఉపాధిహామీ చట్టం పనులను జాబ్‌కార్డు ఉన్న వారు తప్పకుండా పనులు చేయాలని అన్నారు. అంగన్‌వాడీ కేంద్రానికి పిల్లల్ని తప్పకుండా పాపించాలని అన్నారు. గ్రామంలో చదువుకున్నా వారు వృత్తి శిక్షణలు నేర్చుకొని ఉపాధి పొందాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీడీ గోవింద్‌రావు నిర్మల్, ఎంపీఈఓ, రమాదేవి సర్పంచ్, రంభ బాయి సర్పంచ్, దశరథ్ ఎంపీటీసీ, పార్వతి ఉపసర్పంచ్, జీపీ సెక్రటరీ, ఈజీఎస్ సిబ్బంది, డీఆర్డీఓ సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

నవతెలంగాణ-లక్ష్మణచాంద

మండలంలోని పొట్టపెల్లి(కె) గ్రామంలో సోమవారం జిల్లా పంచాయతీ అధికారి రమేష్ పర్యటించారు. గ్రామంలో చెత్త నిర్వహణ, నర్సరీ, డంపింగ్ యార్డ్, ఇంకుడు గుంతలు పరిశీలించారు. అభివృద్ధి పనులు నిర్వహిస్తున్న తీరు పట్ల పూర్తి సంతృప్తి వ్యక్తం చేశారు. స్థానిక సర్పంచ్ ఉల్వాజీ హైమావతి రాజు, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌లను ప్రత్యేకంగా అభినందించారు. ఇలాగే పనులు కొనసాగించి అభివద్ధిలో ప్రథమ స్థానంలో గ్రామాన్ని నిలపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ఉల్వాజీ హైమావతి రాజు, ఎంపీఓ నసీరుద్దీన్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

కుభీర్ ఎంపీడీఓగా టి.లింబాద్రి

నవతెలంగాణ-కుభీర్

కుభీర్ మండల ఎంపీడీఓగా టి.లింబాద్రి సోమవారం బాధ్యతలు తీసుకున్నారు. ఆయన ఎంతో కాలం మమాడ మండల సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహించి, నూతనంగా కుభీర్ మండల ఎంపీడీఓగా బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన ఎంపీఓ కవిరాజ్ నూతనంగా వచ్చిన లింబాద్రికి బాధ్యతలు అప్పగించారు. అనంతరం మండల నాయకులు పంచాయతి కార్యదర్శిలు, ఉపాధిహామీ సిబ్బంది, నూతనంగా వచ్చిన ఎంపీడీఓకు శాలువా కప్పి పూలమాలలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా కార్యదర్శి తూము రాజేశ్వర్, మాజీ జెడ్పీటీసీ శంకర్ చవాన్ సర్పంచులు సంఘం అధ్యక్షుడు దత్తుగౌడ్, మండల సిబ్బంది, రామారావు, నవనీత్ కుమార్ ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మండల పంచాయతీ కార్యదర్శులు, అధికారులు ఉన్నారు.

చెరువులో దూకి బాలుడి ఆత్మహత్య

నవతెలంగాణ-దిలావర్‌పూర్

నర్సాపూర్(జి) మండలంలోని కుస్లి గ్రామంలో బాలుడి ఆత్మహత్య ఘటన కలకలం రేపింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్ర నాందేడ్ జిల్లాలోని తలియచివాడి గ్రామం నుండి వాకుడే రాందాస్ అనే వ్యక్తి గత ఆరు సంవత్సరాల క్రితం బతువు దెరువు కోసం కుస్లి గ్రామానికి వచ్చి కూలీ పని చేస్తూ తన కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఆయనకు ఇద్దరు కొడుకులు, ఒక కూతురు ఉన్నారు. చిన్న కొడుకు వాకుడే నవనాథ్(15) పుట్టుకతో కుడి చేతు, కుడి కాలు అంగవైకల్యం కారణంగా ఇంట్లోనే ఉంటున్నాడు. ఆదివారం ఉదయం రాందాస్ తన భార్యతో చేనులోకి వెళ్లాడు. మద్యాహ్నం ఒంటి గంటకి తిరిగి ఇంటికి వచ్చేసరికి నవనాథ్ ఇంట్లో లేకపోవడంతో చుట్టుపక్కల వెతికినా ఎక్కడా కనిపించలేదు. సోమవారం ఉదయం కుస్లి గ్రామానికి చెందిన వ్యక్తి కాలకృత్యాలకు గ్రామశివారులోని ఎల్లమ్మ చెరువుకి వెళ్లగా అందులో బాలుడి మృతదేహం కనిపించడంతో ఆ వ్యక్తి వెంటనే గ్రామానికి చేరుకొని సమాచారం అందించాడు. గ్రామస్తులు చెరువు వద్దకు చేరుకొని చూడగా బాలుడి మృతదేహం కనిపించింది. మృతుని తండ్రి రాందాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏఎస్సై మాన్‌సింగ్ కేసు నమోదు చేసి విచారణ చేపట్టామని తెలిపారు.

చిరుధాన్యాలపై అంగన్‌వాడీ టీచర్లకు అవగాహన

నవతెలంగాణ-కుభీర్

మండలంలోని గొడిసెరా గ్రామంలో సోమవారం మండలంలోని అన్ని గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల టీచర్లకు అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బైంసా సీడీపీఓ నాగలక్ష్మి హాజరై సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామంలో ఉన్న అంగన్‌వాడీ టీచర్లు తయారు చేసిన చిరుధాన్యాలపై పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ విజయలక్ష్మి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలకు అంగన్‌వాడీ కేంద్రాల్లో సరఫరా చేసే సామగ్రి అన్ని పోషకాలతో కూడిన సామగ్రి పంపిణీ చేయడం జరుగుతుందని అన్నారు. దీంతో వారు ఎంతో ఆరోగ్య వంతులుగా ఉంటారని తెలిపారు. ఇందులో గెలుపొందిన వారికి బహుమతులను ప్రదానం చేయడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల సూపర్‌వైజర్ శోభ, సుజాత, అంగన్‌వాడీ కేంద్రం టీచర్లు ఉన్నారు.

కార్మిక హక్కుల సాధన కోసం పోరాడాలి

- సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నమొల్ల కిరణ్

నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్



కార్మిక ఉద్యమ నిర్మాత, తెలంగాణ సాయుధ, రైతాంగ పోరాట యోధుడు పర్స సత్యనారాయణ స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ కార్మిక హక్కుల సాధన కోసం పోరాడాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ అన్నారు. సోమవారం పర్స సత్యనారాయణ ఎనిమిదవ వర్ధంతిని పురస్కరించుకొని స్థానిక సీఐటీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత కార్మిక పోరాటంలో క్రియాశీలకంగా వ్యవహరించిన వారిలో పర్స సత్యనారాయణ ముఖ్యమైన వారని పేర్కొన్నారు. ఆయన తన 19వ యేటా గూడెం సింగరేణిలో కార్మిక ఉద్యమంలో ప్రవేశించి, అనేక కార్మిక పోరాటాల నిర్మాణంలో ముఖ్యపాత్ర పోషించాడని కొనియాడారు. కార్మిక హక్కుల సాధన కోసం నిజాం సర్కారుకు వ్యతిరేకంగా అనేక పోరాటాలు చేశారని గుర్తు చేశారు. భూమికోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం జరిగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలోనూ ముఖ్యభూమిక పోషించాడని అన్నారు. అంతేకాదు సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షునిగా దీర్ఘ కాలం కార్మిక ఉద్యమానికి సేవలందించిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. ఆయన తన తుది శ్వాస వరకు కార్మిక ఉద్యమానికే అంకితమయ్యారని వివరించారు. నేడు అధికారంలో ఉన్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక హక్కులను కాలరాస్తూ కార్మిక ప్రజాకర్షక వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నాయని ఆరోపించారు. భారత కార్మిక వర్గం అనేక పోరాటాలు, త్యాగాలు చేసి సాధించుకున్న కార్మిక చట్టాలను బీజేపీ ప్రభుత్వం నిర్వీరం చేస్తూ, నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకువచ్చిందని అన్నారు. అలాగే కార్మిక వర్గం అనేక త్యాగాలు చేసి సాధించుకున్న ఎనిమిది గంటల పని దినాన్ని సవరించి కార్మికులను మళ్లీ వేతన బానిసలుగా మార్చేలా 12 గంటల పనిదినాల విధానాన్ని చట్టబద్ధం చేశారని ధ్వజమెత్తారు. భారత కార్మిక వర్గం పర్స సత్యనారాయణ స్ఫూర్తితో లేబర్ కోడ్‌ల రద్దుకై, 8 గంటల పని దినాల సాధనకై కృషి చేయాలని సూచించారు. కనీస వేతనాల సాధన, ఉద్యోగ భద్రత, ప్రభుత్వాల ప్రజా కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలపై కార్మికులు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు బొజ్జ ఆశన్న, ఉపాధ్యక్షులు ఎం.గంగన్న, నాయకులు పుష్ప, చంద్రకళ, రామన్న పాల్గొన్నారు.

చదువుతోనే అభివృద్ధి సాధ్యమని గుర్తించిన మహనీయుడు

- కలెక్టరేట్‌లో ఎంవీ భాగ్యరెడ్డి వర్మ 135 జయంతి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

చదువుతోనే అభివృద్ధి సాధ్యమని గుర్తించి సమాజంలో అసమానతలను తొలగించిన మహనీయుడు ఎంవీ భాగ్యరెడ్డి వర్మ అని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎంవీ భాగ్యరెడ్డి వర్మ 135వ జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి కలెక్టర్ ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంవీ భాగ్యరెడ్డి వర్మ 135వ జయంతి సందర్భంగా జిల్లా ప్రజలందరికి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన సమాజం పట్ల చేసిన సేవలు మరువలేనివని అన్నారు. ఎన్నో విద్యాసంస్థలు స్థాపించి అందరు చదువుకునేలా ప్రోత్సహించారని అన్నారు. సమాజంలో అందరు సమానమని చాటిచెప్పిన మహనీయుడని అన్నారు. విద్యను ఆయుధంగా మలిచి సమాజ అభ్యున్నతికి పాటుపడిన గొప్ప వ్యక్తి అని, ఆయన జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకొని ప్రతి ఒక్కరూ సమాజం పట్ల బాధ్యతగా మెలగాలని ఆకాంక్షించారు. సమాజంలో మార్పుకు, అభ్యున్నతికి పాటుపడిన మహనీయుల జయంతి, వర్ధంతి వేడుకలను రాష్ట్ర ప్రభుత్వం ఘనంగా నిర్వహిస్తుందని తెలిపారు. వారి సేవలు, త్యాగాలను, పోరాటాలను గుర్తుచేసుకోవడంతో పాటు భవిష్యత్ తరాలకు తెలియజేయడం జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఎన్.నటరాజ్, ఆర్డీఓ రమేష్ రాథోడ్, ఎస్సీ అభివృద్ధి శాఖ అధికారిణి సునీత కుమారి, వివిధ కుల సంఘాల ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

మూడోసారి బీఆర్ఎస్ విజయం ఖాయం

నవతెలంగాణ-కడెం



ఖానాపూర్ నియోజకవర్గంలో అభివృద్ధికి కార్యకర్తలే కీలకమని ఎమ్మెల్యే అజ్మీరా రేఖ శ్యామ్ నాయక్ అన్నారు. సోమవారం మండలంలోని కొండుకూర్‌లోని ఎస్‌కె ఫంక్షన్ హాల్‌లో ఎర్పాటు చేసిన బీఆర్ఎస్ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం ఎమ్మెల్యే అజ్మీరా రేఖా శ్యామ్ నాయక్ ఎమ్మెల్సీ గంగాధర గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రేఖా నాయక్ మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ ప్రవేశపెట్టిన ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజాల్లోకి మరింత తీసుకొనివెళ్లాలని ఎమ్మెల్యే అన్నారు. సీఎం కేసీఆర్ దేశంలో తెలంగాణను అగ్రగామిగా నిలుపేందుకు ఎన్నో మంచి సంక్షేమ పథకాలను తెలంగాణలో ప్రవేశపెడుతున్నారని అన్నారు. నియోజకవర్గ అభివృద్ధిలో కార్యకర్తలే కీలక పాత్ర పోషిస్తూ మూడోసారి విజయం సాధించడమే లక్ష్యంగా పని చేయాలని సూచించారు. తెలంగాణ ప్రభుత్వంలో కేసీఆర్ ప్రవేశపెట్టే ప్రభుత్వ పథకాలు ప్రతి ఇంటికి అందుతున్నాయని తెలియజేశారు. అనంతరం ఎమ్మెల్సీ గంగాధర్ గౌడ్ మాట్లాడుతూ జూన్ రెండో తేదీ నుండి రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను 21 రోజులపాటు అన్ని గ్రామాలలో ఘనంగా నిర్వహించుకోవాలని కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జొన్నల చంద్రశేఖర్ గుప్తా, రైతుబంధు సమన్వయ సమితి మండల అధ్యక్షులు నల్ల జీవన్ రెడ్డి, వైస్ ఎంపీపీ కట్ట శ్యాంసుందర్, జెడ్పి కోఆప్షన్ సభ్యులు ఎండీ రఫీక్, ఆత్మ కమిటీ చైర్మెన్ సతీష్, మున్సిపల్ చైర్మెన్ అంకం రాజేందర్, సర్పంచ్ ఫోరంల అధ్యక్షులు గొల్ల వేణుగోపాల్, సర్పంచ్‌లు బొడ్డు గంగన్న, జాడి రాజమణి ఇందూర్, సత్తమ్మ గంగన్న, శాంత చంద్రహస్, రాజారెడ్డి పాల్గొన్నారు.

కుటుంబ పోషణలో మహిళల పాత్ర కీలకం

- ఎంపీపీ ప్రీతమ్‌రెడ్డి



నవతెలంగాణ-ఇచ్చోడ

కుటుంబ ఆర్థిక పోషణలో మహిళల పాత్ర కీలకమని ఎంపీపీ ప్రీతమ్‌రెడ్డి అన్నారు. సోమవారం జన శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో మూడు నెలలు వివిధ రకాల కోర్సుల్లో శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు సర్పంచ్ చౌహాన్ సునీత అధ్యక్షతన మండల కేంద్రంలోని శిక్షణా కేంద్రంలో ఎంపీపీ నిమ్మల ప్రీతమ్ రెడ్డి సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. కంప్యూటర్ నేర్చుకున్న యువతీ, యువకులతో మాట్లాడుతూ నేటి కాలంలో ప్రతి ఒక్కరికి కంప్యూటర్ శిక్షణ చాలా అవసరమని సర్టిఫికెట్లు తీసుకున్న అభ్యర్థులు ప్రభుత్వ ప్రయివేటు రంగాలలో ఉద్యోగాలు సాధించవచ్చని తెలిపారు. బ్యూటిషన్, టైలరింగ్ మహిళలతో సర్పంచ్ సునీత మాట్లాడుతూ ఆర్థికంగా మహిళలు అభివృద్ధి చెందాలంటే నేర్చుకున్న శిక్షణను కొనసాగిస్తూ డబ్బులు సంపాదించాలని బ్యాంకుల ద్వారా రుణ సదుపాయం పొంది కొత్త షాపులను నెలకొల్పాలని అన్నారు. మొత్తం పదిహేను బ్యాచుల గాను 300 మంది అభ్యర్థులకు సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ శిరీష్‌రెడ్డి, జన శిక్షణ సంస్థ అసిస్టెంట్ ప్రోగ్రాం ఆఫీసర్ వర్ని సంతోష్, ఫీల్డ్ ఆఫీసర్ రాజు, కంప్యూటర్ టీచర్ కాదిర్, టైలరింగ్ బ్యూటీషన్ టీచర్లు అభ్యర్థులు పాల్గొన్నారు.

జైత్రం తండలో తాగునీటి కష్టాలు

- ఏఐసీసీ రీసెర్చ్ డైరెక్టర్ వినోద్ నాయక్ ధ్వజం

నవతెలంగాణ-ఇంద్రవెల్లి



మండలంలోని వడ్‌గావ్ పంచాయతీ పరిధిలోని జైత్రం తండలో గుక్కెడు తాగు నీరు దొరకక జనం తల్లాడి పోతున్నారని ఏఐసీసీ రీసెర్చ్ డైరెక్టర్ రాష్ట్ర కోఆర్డినేటర్ వినోద్ నాయక్ అన్నారు. ఆయన సోమవారం జైత్రం తండను, మథుర తాండను సందర్శించారు. తాగునీటి సమస్యలపై గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. సుమారుగా 2 కి.మీ.దూరం నుంచి వాగుల నుండి తాగునీటిని తీసుకొస్తున్నామని అన్నారు. గ్రామస్తులు నారాయణ్, నానక్, రమేష్, మమత, కల్యాణి ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులకు ఒక ప్రకటన విడుదల చేశారు. ఖానాపూర్ ఎమ్మెల్యే గొప్పలు చెప్పుకుంటున్న నియోజక వర్గంలో కనీసం తాగు నీటి కోసం చెలిమెల నీళ్ల తాగడం ఎంతవరకు సమంజసమని అన్నారు. గొప్పలు చెప్పుకుంటున్న ప్రభుత్వం ఇంటింటికీ మిషన్ భగీరథ ద్వారా తాగు నీళ్ల అందిస్తున్నామని అనడం మానుకోవాలని అన్నారు. ఒక సారి జైత్రం తండకు వచ్చి తాగునీటి కష్టాలు చూడాలని సవాల్ చేశారు. ఇదేనా బంగారు తెలంగాణ అని విమర్శించారు. ఇప్పటికైనా ఖానాపూర్ పాలకులు తాగునీటి కష్టాలు ఎదుర్కొంటున్న జైత్రం తండ వాసుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన వెంట కాంగ్రెస్ మండల అధ్యక్షులు సోమురే నాగోరావ్, ఉత్తం ముఖాడే పాల్గొన్నారు.

స్వచ్ఛ భారత్ అవగాహన కార్యక్రమం

నవతెలంగాణ-లక్ష్మణచాంద

మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం స్వచ్ఛ భారత్, సుజలం కార్యక్రమం గురించి కోఆర్డినేటర్ అబుజర్ అవగాహన కల్పించారు. స్వచ్ఛ భారత్ కార్యక్రమం విజయవంతం చేయాలని అన్నారు. ప్రతీ ఇంటిలో కిచెన్ గార్డెన్ ఏర్పాటు, ఇంకుడు గుంతలు, సెప్టిక్ ట్యాంక్ నిర్వహణ గురించి మండల పంచాయతీ కార్యదర్శులు, టీఏలు, ఫీల్డ్ అసిస్టెంట్లకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శేఖర్, ఎంపీఓ నసీరుద్దిన్, ఏపీఓ ప్రమీల, ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



ఎస్సై అప్పారావుకు సన్మానం

నవతెలంగాణ-తలమడుగు

మండలంలోని స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్సైగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన అప్పారావును సోమవారం నేతకాని, మహార్ సంఘం నాయకులు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. సన్మానించిన వారిలో నేతకాని, మహార్ సంఘ నాయకులు మునేశ్వర్ సుదర్శన్, దాదారావు, దిలీప్ హాడ్కర్, సచిన్, సర్వే రవి, గోరఖ్‌నాథ్, భీంరావు, దయానంద్ గైక్వాడ్, వాంకిడే గౌతమ్, కపిల్ ఉన్నారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-ఖానాపూర్

వరికొనుగోలు కేంద్రాలను రైతుల సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే రేఖా నాయక్ అన్నారు. సోమవారం ఖానాపూర్ మండలంలోని రాజురా గ్రామంలో ప్యాక్స్ ఆధర్వంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అధికారులకు ప్యాక్స్ సిబ్బందికి తగు సూచనలు చేశారు. రైతుల వద్ద నుండి వెంట వెంటనే ధాన్యం తరలించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఖానాపూర్ మండల ప్రజా ప్రతినిదులు, నాయకులు, గ్రామ ప్రజలు, ప్రజా ప్రతినిదులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న పారిశుధ్య పనులు

నవతెలంగాణ-నార్నూర్

మండలంలోని 23 గ్రామ పంచాయతీల్లో నిర్వహిస్తున్న పారిశుధ్య వారోత్సవాల్లో భాగంగా పారిశుధ్య పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. సోమవారం తాడిహత్నూర్ గ్రామపంచాయతీలో కొనసాగుతున్న పారిశుధ్య పనులను డీఎల్పీఓ భిక్షపతిగౌడ్ పరిశీలించారు. రానున్న రోజుల్లో వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వ ఆదేశానుసారం గ్రామాల్లో వ్యాధులు ప్రబలకుండా ముందస్తు పారిశుధ్య పనులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పారిశుధ్యం లోపించకుండ చూడాలని కార్యదర్శిని ఆదేశించారు. వారి వెంట ఎంపీఓ స్వప్నశీలా, కార్యదర్శి కొల శేకర్, పారిశుధ్య కార్మికులు ఉన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు

నవతెలంగాణ-సారంగాపూర్

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎఓ రాజశేఖర్‌రెడ్డి, ఎస్సై కష్టా సాగర్ రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో మండలంలోని వివిధ గ్రామాల్లో ఉన్న ఫర్టిలైజర్ డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. నకిలీ విత్తనాలు, కాలంచెల్లిన మందులు విక్రయిస్తే, ఎరువులను అధిక ధరలకు, అమ్మిన కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు.

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-ఖానాపూర్

కంటి వెలుగును ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే రేఖా నాయక్ అన్నారు. సోమవారం ఖానాపూర్ మండలంలోని సుర్జాపూర్ రెండో విడుత కంటి వెలుగు కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కంటిచూపు సమస్యలతో బాధపడుతున్న ప్రజలకు వైద్యసేవలు అందించేందుకు సీఎం కేసీఆర్ ఈ పథకాన్ని రూపొందించారని అన్నారు. ప్రభుత్వం ఉచితంగా ప్రజలకు కంటి పరీక్షలు నిర్వహించి, కళ్లద్దాలు, అవసరమైన వారికి శస్త్రచికిత్సలు, మందులను అందజేస్తుందని అన్నారు. 18 ఏండ్లు పైబడిన ప్రతి ఒక్కరూ ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల ప్రజా ప్రతినిధులు నాయకులు కార్యకర్తలు, వైద్య అధికారులు పాల్గొన్నారు.

జూన్ 6న అంబేద్కర్ మనువడి బహిరంగ సభ

నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

జిల్లా కేంద్రంలో జూన్ 6న నిర్వహించనున్న అంబేద్కర్ మనుమడు ప్రకాష్ అంబేద్కర్ భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని అంబేద్కర్ ఉత్సవ కమిటీ చైర్మెన్ దుర్గం శేఖర్ కోరారు. సోమవారం స్థానిక ఎలక్ట్రానిక్ మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాత డా.బాబా సాహెబ్ అంబేద్కర్ మనమడు శ్రీ ప్రకాష్ అంబేద్కర్ జూన్ 6న జిల్లా కేంద్రానికి రానున్నట్లు తెలిపారు. అనంతరం కార్యక్రమానికి సంబంధించిన వాల్ పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ చైర్మెన్ దుర్గం శేఖర్ మాట్లాడుతూ జూన్ 6న జిల్లా కేంద్రంలోని రాంలీలా మైదానంలో ఏర్పాటు చేసే భారీ బహిరంగ సభకు ప్రకాష్ అంబేద్కర్ ముఖ్య అతిధిగా హాజరవుతారని తెలిపారు. సమావేశాన్ని రాజకీయాలకు అతీతంగా, అన్ని రాజకీయ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, బీసీ, ఓసీ వర్గాల నాయకులు, ప్రజలు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని అన్నారు. ఈ సమావేశంలో సందీప్, బోర్లకుంట దీపక్, అల్లూరి భూమన్న, మస్కే తేజరావు, మల్యాల మనోజ్, నాకే సామ్, ప్రజ్ఞ కుమార్, నక్క రాందాస్, పంచశీల్, అనిల్ సవ్వడే, నిమ్మల ప్రశాంత్, సాయిబాబా, వర్షా కాంబ్లే, సురేందర్, చంద్రకళ, సాయి మాధస్తూ, మహేందర్, కావేటి మోహన్, రఘునాథ్, రాహుల్ జాందడే పాల్గొన్నారు.

ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన యువకుడి పరిస్థితి విషమం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని విద్యానగర్ కాలానికి చెందిన యువకుడు రోహిత్ సిండేను ఆదిలాబాద్ వన్‌టౌన్ సీఐ సత్యనారాయణ మానసికంగా వేధిస్తున్నారని మనస్థాపంతో ఆదివారం రాత్రి వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ ఎదుట పెట్రోల్ పోసుకుని, పురుగులమందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడిన విషయం తెలిసిందే. కాగా యువకుడి పరిస్థితి విషమంగా ఉన్నట్లు కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. ప్రస్తుతం రిమ్స్‌లో చికిత్స పొందుతున్న ఆయనను ఎమర్జెన్సీ విభాగానికి వైద్యులు తరలించినట్లు తెలిసింది. అయితే యువకుడు ఈ పరిస్థితికి రావడానికి కారణం వన్‌టౌన్ సీఐ సత్యనారాయణ అన్నట్లుగా వినిపిస్తుండగా గతంలో బాధిత యువకుడు పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారి కుమార్తెను ప్రేమ వివాహం చేసుకోగా యువతి బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు డబ్బులు తీసుకుని సీఐ బాధిత యువకున్ని మానసికంగా హింసిస్తున్నట్లు యువకుడు పేర్కొన్నారు. ఇలా గత నెల రోజుల నుంచి కొనసాగుతుందని ఇది తట్టుకోలేక ఆత్మహత్యయత్నం చేయాల్సి వచ్చిందని బాధితులు తెలిపారు. ప్రస్తుతం బాధితుడు రిమ్స్‌లో ఐసీయూ విభాగంలో చికిత్స పొందుతున్నట్లు కుటుంబ సభ్యులు తెలియజేశారు.

జన ఆరోగ్య సమీక్షతో సీజనల్ వ్యాధులపై అవగాహన

ఆదిలాబాద్ అర్బన్ : ప్రతి నెల మూడో వారంలో జన ఆరోగ్య సమీక్షా సమావేశాన్ని ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించడం జరుగుతుందని మున్సిపల్ చైర్మెన్ జోగు ప్రేమేందర్ అన్నారు. సోమవారం స్థానిక పుత్లీబౌలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన చర్యలపై వివరించారు. పురపాలక, వైద్యారోగ్య శాఖల ద్వారా చేపడుతున్న వివిధ కార్యక్రమాలను వివరించారు. వ్యాధుల కట్టడికి తీసుకుంటున్న చర్యలపై అధికారులు, సిబ్బందితో చర్చించారు. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని సీజనల్ వ్యాధుల నియంత్రణకు ఇప్పటినుండే పటిష్ట కార్యాచరణ అమలు చేస్తున్నామని వివరించారు. మున్సిపల్, వైద్యారోగ్య సిబ్బంది సమన్వయంతో పని చేస్తూ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలందించాలని అన్నారు. అలాగే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో కాంప్లైంట్ బాక్స్ ఏర్పాటుచేసి స్థానికంగా ఉన్నటువంటి సమస్యలను తెలియజేసేలా అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు డీఎంహెచ్ డాక్టర్ సాధన, ప్రశాంత్, ఫాతిమా, అన్నపూర్ణ, సీఓ నవీన్, ఆర్‌పీ సునీత పాల్గొన్నారు.

అనుదినం జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
మంగళవారం 23 మే 2023

రెవెన్యూ సిబ్బందికి వినతిపత్రం అందజేత



నవతెలంగాణ-కెరమెరి

రేషన్ డీలర్ల సమస్యలు పరిష్కరించాలని సోమవారం రేషన్ డీలర్ల సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. వినతిపత్రంలో పలు సమస్యలను రెవెన్యూ సిబ్బంది దృష్టికి తీసుకెళ్లారు. ప్రతి నెల డీలర్లకు వేతనాలు చెల్లించాలని, రేషన్ సరుకుల దిగుమతి ఖర్చులు ప్రభుత్వమే చెల్లించాలని పేర్కొన్నారు. క్వింటాల్‌కు ఒక శాతం తరుగు ఇవ్వాలన్నారు. ప్రతి నెల ఈ పాస్ మెషిన్‌లో క్లోజింగ్ బ్యాలెన్స్ తొలగించాలన్నారు. కారుణ్య నియామకాలు 50 సంవత్సరాలకి పెంచాలని విన్నవించారు. తహసీల్దార్ అందుబాటులో లేకపోవడంతో సిబ్బందికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో రుక్మాజి, ఆయుబ్, చగన్ పాల్గొన్నారు.

రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని విజయవంతం చేయాలి

నవతెలంగాణ-మందమర్రి

జూన్ 2వ తేదీన తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మందమర్రి ఏరియా సేవా అధ్యక్షురాలు జి. యశోద మోహన్ రెడ్డి, సేవా సభ్యులు, ఫ్యాకల్టీతో సోమవారం స్థానిక ఎల్లందు క్లబ్ లో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జూన్ రెండవ తారీఖున సింగరేణి ఆధ్వర్యంలో నిర్వహించే తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని తెలిపారు. అదే విధంగా మే 27 ఉదయం 9 గంటలకు మహిళలకు ఆటల పోటీలు, బృంద నృత్యాలు ఎల్లందు క్లబ్‌లో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని మహిళలు, కార్మికుల కుటుంబ సభ్యులు, సేవా సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సింగరేణి సేవ సమితి మరియు కమ్యూనికేషన్ సెల్ కోఆర్డినేటింగ్ ఆఫీసర్ కె.మైత్రేయ బంధు, లేడీస్ క్లబ్ సభ్యులు కవిత భూ శంకరయ్య, సేవా సభ్యులు, ఫ్యాకల్టీ, యోగా మాస్టర్స్, సింగరేణి సేవా సమితి కమ్యూనికేషన్ సెల్ కోఆర్డినేటర్స్ పాల్గొన్నారు.

తోట రవిపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలి



నవతెలంగాణ-హాజీపూర్

వాట్సప్ గ్రూప్‌లో దళిత యువకుడు ప్రవీణ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తోట రవిపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని మాల మహానాడు నాయకులు డిమాండ్ చేశారు. ప్రవీణ్‌కు న్యాయం చేయాలని మాల మహానాడు నాయకులు సోమవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లడుతూ ఆదివారం రాత్రి మండలంలోని ఓ వాట్సప్ గ్రూప్‌లో బీఆర్ఎస్‌కు సంబంధించిన మెస్సేజ్‌ను ప్రవీణ్ పోస్ట్ చేయగా వెంటనే కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రవి ప్రవీణ్‌ను అసభ్య పదజాలంతో దూషిస్తూ వాయిస్ మెసేజ్‌లు పెట్టడంపై మండి పడ్డారు. బీఆర్ అంబెద్కర్ రాసిన రాజ్యాంగంలోని హక్కులను కాలరాస్తు దళిత యువకునిపై అనుచిత వాఖ్యలు చేసిన వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో న్యాయం జరిగే వరకు రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు కంబాల రాజేష్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, రాష్ట్ర అధికార ప్రతినిధి పొట్ట మధుకర్, సోగాల కిష్టయ్య మల్లన్న, రమేష్, సమ్మన్న, నర్సింగ్, ప్రవీణ్, ఆనంద్ పాల్గొన్నారు.

పాత మార్కెట్ కోసం కూరగాయల దుకాణాల బంద్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

పాత మార్కెట్‌లో కూరగాయల విక్రయాన్ని యధావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేస్తూ జూబ్లీ మార్కెట్‌లో కూరగాయల విక్రయదారులు సోమ, మంగళవారాలు రెండు రోజుల బందుకు పిలుపు ఇచ్చారు. దీనిలో భాగంగా సోమవారం ఎవరు కూడా దుకాణాలు తెరవలేదు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జూబ్లీ మార్కెట్‌కు కూరగాయలు మార్కెట్ తరలించడంతో గిరాకీలు తగ్గాయని అన్నారు. మార్కెట్‌ను పాత స్థలానికి మార్చాలని డిమాండ్ చేశారు. ఇదే విషయంపై మంగళవారం కలెక్టర్‌ను కలిసి పరిస్థితి వివరించనున్నట్లు తెలిపారు. పాత మార్కెట్ స్థానంలో ఉన్న షెడ్లను తొలగించిన అధికారులు రూ.40 లక్షల వ్యయంతో దుకాణ సముదాయం ఏర్పాటు చేయడానికి డిఎంఎఫ్టీ నిధులు కేటాయించారు. ప్రస్తుత జూబ్లీ మార్కెట్‌లో అన్ని సౌకర్యాలు ఉన్నాయని కొంతమంది స్వప్రయోజనం కోసం అనవసరమైన వాదనలు తెరమీదకి తెస్తున్నారని అధికారులు చెబుతున్నారు. ఒక పార్టీకి చెందిన కొంతమంది నాయకులు అనవసరమైన రాద్ధాంతం చేస్తున్నారని జిల్లా కేంద్రం విస్తరిస్తుందని పాత మార్కెట్ స్థానంలో కూరగాయల విక్రయం జరిగితే ట్రాఫిక్ ఇబ్బంది తలెత్తుతుందని ప్రస్తుతం మార్కెట్ అనుకూలంగా ఉందని అధికార పార్టీ నాయకులు చెబుతున్నారు. అలాగే పాత మార్కెట్ స్థానంలో షాపింగ్ కాంప్లెక్స్ ఏర్పడితే మరింత అభివృద్ధి చెందుతుందని అన్నారు.

ప్లాస్టిక్ రహిత గనిగా ఆర్‌కే-6ను తీర్చిదిద్దాలి

నవతెలంగాణ-నస్పూర్



ప్లాస్టిక్ రహిత గనిగా ఆర్కే 6ను తీర్చిదిద్దాలని గని మేనేజర్ ఇ.తిరుపతి తెలిపారు. పర్యావరణ పరిరక్షణ వారోత్సవాల సందర్భంగా సోమవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గని మేనేజర్ ఇ.తిరుపతి మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షించేందుకు అందరూ కృషిచేయాలని సూచించారు. మొక్కలను నాటాలని, భూగర్భజాలాలను కాపాడటం కోసం ఇంకుడు గుంతలను ఏర్పాటుచేయాలని పేర్కొన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి ప్లాస్టిక్ రహిత గనిగా తీర్చిదిద్దాలని కోరారు. పర్యావరణ పరిరక్షణకొరకు ప్రతి ఒక్కరు తమ విధిగా భావించాలని ఆర్.కె.6 గని ఉద్యోగులను కోరారు. అనంతరం కార్మికులు పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములమవుతామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో రక్షణాధికారి కాదసి శ్రీనివాస్, డిప్యూటీ మేనేజర్ కొమురయ్య, ఫిట్ ఇంజనీర్ ఎ.శ్యాం కుమార్, ఇంజనీర్ ఆర్.మహేష్, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ సునిల్ కుమార్, గుర్తింపు సంఘం నాయకులు,ఆఫీసు సిబ్బంది, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు అండగా ఉండాలి

- ఆసిఫాబాద్ ఎస్పీ సురేష్ కుమార్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

శాంతిభద్రతల పరిరక్షణతో పాటు ప్రజా సమస్యలపై వెంటనే స్పందిస్తూ బాధితులకు అండగా ఉండాలని ఆసిఫాబాద్ ఎస్పీ సురేష్ కుమార్ తెలిపారు. ప్రజావాణిలో భాగంగా ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా వచ్చిన ఫిర్యాదులకు సంబంధించి ఆయా పోలీస్‌స్టేషన్‌ల అధికారులతో మాట్లాడారు. ప్రజా ఫిర్యాదుల పట్ల బాధ్యతతో వ్యవహరించి బాధితులకు అండగా ఉండాలన్నారు. సరైన న్యాయం చేసినప్పుడే పోలీసులకు గుర్తింపు లభిస్తుందని సూచించారు. శాంతిభద్రతలకు భంగం కలిగించే వారి పట్ల కఠినంగా వ్యవహరించాలన్నారు. మహిళ బాధితురాల్లకి తక్షణ న్యాయం చేయాలని సూచించారు.

స్పష్టమైన ఓటరు జాబితా రూపొందించాలి

- ఆసిఫాబాద్ అదనపు కలెక్టర్ రాజేశం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

పొరపాట్లు లేని స్పష్టమైన ఓటరు జాబితా రూపొందించడంలో రాజకీయ పార్టీల ప్రతినిధుల పాత్ర కీలకమైనదని, పారదర్శకమైన ఓటరు జాబితా తయారు చేయాలని ఆసిఫాబాద్ అదనపు కలెక్టర్ రాజేశం అన్నారు. సోమవారం వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటరు జాబితా రూపొందించడంలో రాజకీయ పార్టీల ప్రతినిధుల పాత్ర చాలా కీలకమైనదని, జాబితా తయారీలో బూత్ స్థాయి అధికారులు, తహసీల్దార్లకు సహకరించాలని తెలిపారు. ఏదైనా సమస్య తలెత్తినట్లయితే అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కారం దిశగా కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

వీఓఏల కలెక్టరేట్ ముట్టడి ఉద్రిక్తం

- అదుపులోకి తీసుకునే క్రమంలో పలువురికి గాయాలు
- అరెస్టు చేసి స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలింపు



ఆసిఫాబాద్‌లో..

నవతెలంగాణ-ఆసిఫాబాద్

తమ డిమాండ్లు పరిష్కరించాలని తమను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని వీఓఏలు గత 35 రోజులుగా చేస్తున్న సమ్మెలో భాగంగా సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో చేపట్టిన కలెక్టరేట్ ముట్టడి ఉద్రిక్తంగా మారింది. ఉదయం 9.30 గంటలకు కలెక్టరేట్ వద్దకు చేరుకున్న వీఓఏలు నినాదాలతో కలెక్టరేట్ ప్రాంగణం దద్దరిల్లింది. యధావిధిగా 10 గంటలకు కలెక్టరేట్‌కు వచ్చిన అదనపు కలెక్టర్ రాజేశంకు దారి వదలక పోవడంతో తిరిగి వెళ్లాల్సి వచ్చింది. చివరకు 11 గంటలకు కలెక్టర్ వచ్చే సమయానికి కంటే ముందుగా వీఓఏలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ క్రమంలో ఇరువురి మధ్య తోపులాట జరగడంతో పలువురికి గాయాలయ్యాయి. మొదట మహిళా వీఓఏలను అదుపులోకి తీసుకోవడానికి పురుష పోలీసులు ప్రయత్నించడంతో కొంత ఆందోళన ప్రారంభమైంది. దీనితో వెంటనే మహిళ పోలీసులు రంగంలోకి దిగి అందరిని అదుపులోకి తీసుకునే క్రమంలో వీఓఏల గాజులు పగిలిపోయి గాయాలయ్యాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థలో పనిచేస్తూ మహిళలను ఆర్థికంగా చైతన్య పరుస్తున్న వీఓఏల పేదరికం పోగొట్టే చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వం విఫలమయ్యిందన్నారు. న్యాయమైన డిమాండ్ సాధన కోసం జరుగుతున్న సమ్మె విచ్చినానికి కొందరు ప్రయత్నిస్తున్నారని, రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చర్చలకు పిలిచి డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. ముట్టడి కార్యక్రమం తో ఉద్యమం విస్తరించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు అల్లూరి లోకేష్, నాయకుడు కృష్ణమాచారి, వీఓఏల సంఘం గౌరవ అధ్యక్షుడు రాజేందర్, వీఓఏల జిల్లా అధ్యక్షురాలు సీహెచ్.జ్యోతి, రాష్ట్ర నాయకురాలు సునీత, మండల కార్యదర్శి రమాదేవి, కల్పన, జయ, ఫైమ, శ్రీలక్ష్మి, శారద, సరిత, సురేఖ, సుదీర్, వినోద్, ఓమాజీ, వినోద్, భీంరావ్, ధర్మరాజు, రమేష్, శంకర్, గణేష్, జైవంత్ పాల్గొన్నారు.



ఆసిఫాబాద్‌లో..



మంచిర్యాల కలెక్టరేట్ ఎదుట(హాజీపూర్)

వీఓఏల పట్ల ప్రభుత్వం మొండి వైఖరి విడనాడాలి

హాజీపూర్ : వీఓఏల పట్ల ప్రభుత్వం వ్యవహరిస్తున్న మొండి వైఖరిని విడనాడాలని వీఓఏల సంఘం(సీఐటీయూ) గౌరవ అధ్యక్షుడు దుంపల రంజిత్ డిమాండ్ చేశారు. ఐకేపీ వీఓఏల ఉద్యోగుల సంఘం(సీఐటీయు) రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా సోమవారం రోజున జిల్లా కేంద్రంలోని తాపీ మేస్త్రి సంఘం భవనం నుండి జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి కలెక్టరేట్ ముట్టడించిన అనంతరం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా దుంపల రంజిత్ కుమార్ మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా ఐకేపీ వీఓఏలు వారి న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని గత 2 నెలల క్రితం నుండి సెర్ప్ సీఈఓ, మంత్రులకు వినతిపత్రాలు ఇచ్చిన స్పందించకపోవడంతో రాష్ట్ర వ్యాప్తంగా సమ్మె చేయడం జరుగుతుందన్నారు. జిల్లా, మండలం అధికారులు సమ్మె చేస్తున్న వీఓఏలను విధుల నుండి తొలగిస్తామని బెదిరింపులకు గురి చేయడం ఆపాలన్నారు. సమస్యలపై పోరాడే హక్కును భారత రాజ్యాంగం కల్పించిందనీ తెలిపారు. రాజ్యాంగ హక్కులను కాలరస్తే ఊరుకోమని హెచ్చరించారు. వీఓఏల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం వీడాలన్నారు. అందరికి వేతనాలు పెంచిన ప్రభుత్వం వీఓఏలకు పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలనీ డిమాండ్ చేశారు. గత కొన్ని సంవత్సరాలుగా సభ్యులకు రావాల్సిన అభయహస్తం డబ్బులు వెంటనే చెల్లించాలన్నారు. గ్రామ సంఘాలకు పక్క భవనాలు నిర్మించాలన్నారు. సెర్ప్ నుండి ఐడి కార్డులు, యూనిఫామ్ ఇవ్వాలన్నారు. సమస్యలపై రాష్ట్ర మంత్రులు చర్చలకు పిలిచి పరిష్కరం చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే రాబోయే రోజుల్లో హైదరాబాద్ సెర్ప్ ఆఫీస్ ముట్టడి చేస్తామని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి పుట్ట పోషం, అన్వర్, అలీమ్, సురేష్, వెంకటేష్, జిల్లా కమిటీ సభ్యులు, తుకారాం, దాసు పాల్గొన్నారు.

స్థానిక ఎమ్మెల్యేనే పేదలకు ఇండ్ల స్థలాలు ఇప్పించాలి

- సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటి సభ్యులు లెల్లెలా బాలకృష్ణ



నవతెలంగాణ-జైపూర్

చెన్నూర్ మండలం బావురావుపేట్ శివారు సర్వే నెం.8లో పేదలకు ఇండ్ల స్థలాలు ఇప్పించే బాధ్యత చెన్నూర్ ఎమ్మెల్యే బాల్క సుమన్ తీసుకోవాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటి సభ్యులు లేళ్లేలా బాలకృష్ణ డిమాండ్ చేశారు. గత 23 రోజులుగా బావురావుపేట్ శివారులో ఇండ్ల స్థలాలు కెటాయించాలని డిమాండ్ చేస్తూ పోరాటం చేస్తున్న పేద కుటుంబాల వారిని సోమవారం కలిసి మద్దతు తెలిపారు. ఈ సంధర్భంగా మాట్లాడుతూ అట్టడుగు వర్గాల పేద ప్రజలు మహిళలు, వృద్దులు, చంటి పిల్లతల్లులు ఎర్రటి ఎండలో ఇంటి స్థలాల కోసం పోరాటం చేస్తున్నారని అన్నారు. పేదల న్యాయమైన డిమాండ్ పట్ల కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు బాధ్యతగా వ్యవహరించి అసైన్‌మెంట్ చట్టం ప్రకారం పేదలైన వారిని గుర్తించి వారికి చెందాల్సిన భూములు వారికే చెందే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. చెన్నూర్ మండలం బావురావుపేట్ శివారులో అసైన్ చట్టానికి తూట్లు పొడుతుస్తున్నారని, అసైన్ భూములను ప్లాట్లుగా మారుస్తున్న స్థానిక కౌన్సిలర్లు, భూకబ్జాదారులు, రియల్ ఎస్టేట్ దందా చేస్తున్నారని ఆరోపించారు. ఈ విషయంలో రెవెన్యూ అధికారులు చూసిచూడనట్లు తీరు శోచనీయమని పేర్కొన్నారు. బావురావుపేట్ శివారు అసైన్‌మెంట్ భూముల పంపిణీపై పూర్తి స్థాయిలో దర్యాప్తు జరిపించాలని, కబ్జాదారుల చేతుల్లోకి చేరిన తిరిగి తీసుకోవాలని డిమాండ్ చేశారు. భూపోరాటానికి సంబంధించి పేదలపై అక్రమంగా బనాయించిన కేసులు వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి సంకె రవి, కార్యవర్గ సభ్యురాలు దాసరి రాజేశ్వరి, జిల్లా కమిటి సభ్యులు బొడంకి చందు, పట్టణ కార్యదర్శి ఆవేజ్ కావిరి రవి, మారన్న, కరీమా, సమ్మక్క, పోసక్క సభ్యులు, ఇండ్ల పోరాట కమిటి సభ్యులు మానక్క, రేణుక, పోసక్క, రాజేశ్వరి, మదునక్క, ఉమారాణి, ప్రసన్న, వైశాలి, అత, పవనసుధ, శైలజ, రాజేశ్వరి పాల్గొన్నారు.

డీజీఎంఎస్ ఉదాసీనత, నిర్లక్ష్య వైఖరి విడనాడాలి



నవతెలంగాణ-నస్పూర్

సింగరేణిలో పెరుగుతున్న డీజీఎంఎస్ ఉదాసీనత నిర్లక్ష్య వైఖరిని విడనాడాలని సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంఘం(బీఎంఎస్) ఏరియా కార్యదర్శి నాతాడిశ్రీధర్‌రెడ్డి అన్నారు. ఈ ఉదాసీనత నిర్లక్ష్య వైఖరికి నిరసనగా దేశవ్యాప్తంగా అఖిల భారతీయ ఖాదన్ మజ్దూర్ సంఘ్-బీఎంఎస్ ఆధ్వర్యంలో అన్ని బొగ్గు గనుల జీఎం ఆఫీసుల ముందు నిరసన కార్యక్రమం ధర్నాలు నిర్వహించారు. అందులో భాగంగానే నాతాడి శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయం ముందు ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ దేశంలో పెరుగుతున్న విద్యుత్ వినియోగానికి అనుగుణంగా విద్యుత్ ఉత్పత్తి కోసం మరింత బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని నిర్దేశించుకున్నప్పుడు గనులలో కార్మికుల రక్షణ, భద్రత నియమాలు, చట్టాలను కఠినంగా అమలు చేయవలసిన డైరెక్టర్ జనరల్ మైన్స్ సేఫ్టీ అవినీతి, నిర్లక్ష్య ధోరణి వలన తీవ్రమైన ప్రాణాంతక ప్రమాదాలు పెరుగుతున్నాయన్నారు. దీంతో ఉత్పత్తి-ఉత్పాదకత పెరుగుదలపై ఉన్న శ్రద్ధ భద్రతపై లేకపోవటం శోచనీయం అన్నారు. బొగ్గు మంత్రిత్వ శాఖ మంత్రివర్యులు ప్రహ్లాద్ జోషి అనేక సార్లు స్టాండింగ్ కమిటీలో జీరో ఆక్సిడెంట్ ద్వారా బొగ్గు ఉత్పత్తి జరగాలని, కావలసినంత ఆర్థిక నిధులు కేటాయించినప్పటికిని డీజీఎంఎస్ నిర్లక్ష్యం వలన ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. ప్రమాదాలు జరిగినప్పుడు అధికారులను తప్పించే ప్రయత్నంలో కార్మికులను బలి చేస్తూ కార్మికుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని డీజీఎంఎస్‌పై తీవ్రస్థాయిలో హెచ్చరించారు. కొంతమంది అవినీతి డిజిఎంఎస్ అధికారులు దేశంలోని బొగ్గు గనుల భద్రతా తనిఖీలు నిర్వహించే క్రమంలో కంపెనీలో యాజమాన్యంతో కుమ్మకైపోయి భద్రతా నియమాలు, చట్టాలను ఉల్లంఘలను పట్టించుకోకుండా బొగ్గు గనుల యాజమాన్యంతో అవినీతికి పాలు పడటం వలన కార్మికుల ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయని ఆరోపించారు. అవినీతి అధికారులపైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, దేశవ్యాప్తంగా బొగ్గు గనుల్లో ఉధృతంగా తనిఖీలు చేపట్టి రక్షణ సూత్రాలకు నిర్లక్ష్యం వహిస్తున్న అధికారులపై కఠినంగా చర్యలు తీసుకోవాలని ఎస్సీఎంకేఎస్, బీఎంఎస్ ఈ సందర్భంగా డిమాండ్ చేస్తూ శ్రీరాంపూర్ ఏరియా జీఎం సంజీవరెడ్డికి వినతి పత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీఎంఎస్ నాయకులు కాశెట్టి నాగేశ్వరరావు, జీడి ప్రభాకర్, రామగిరి పురుషోత్తమా చారి, పాగిడి శ్రీకాంత్, బొడిగే చంద్రశేఖర్, మంద కమలాకర్, చల్ల ప్రశాంత్ రెడ్డి, సంజీవ్, లక్ష్మణ్, సాయి, కుమార్, సంపత్ పాల్గొన్నారు.

ఓరియంట్ ఆధ్వర్యంలో పరిసరాల శుభ్రత

నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని దేవాపూర్ ఓరియంట్ సిమెంట్ కంపెనీ ఆధ్వర్యంలో తెలంగాణ ప్రభుత్వం, తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి ఆదేశాల మేరకు జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రభుత్వ మిషన్ లైఫ్ మూమెంట్లో భాగంగా కాలుష్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. దీంతో పాటు పర్యాటన ప్రాంతమైన సల్పాలవాగు వద్ద ఓరియంట్ అధికారులు, సిబ్బంది కలిసి ప్లాస్టిక్ వ్యర్థాల తొలగింపు కార్యక్రమాన్ని చేపట్టి పరిసరాల శుభ్రం చేశారు. వ్యర్థాలను సేకరించి సిమెంట్ కిలన్లో కాల్చేశారు. ఈ సందర్భంగా ఓరియంట్ సిమెంట్ యూనిట్ హెడ్ మహేంద్ర ప్రతాప్ జోషి మాట్లాడుతూ ఉద్యోగులు, కార్మికులు ప్రజలు పర్యావరణ అనుకూల జీవిన విధానాలు అలవాటు చేసుకోవాలని, విద్యుత్ శక్తిని ఆదా చేయాలని, మొక్కలు నాటాలని, సింగిల్ యూస్ ప్లాస్టిక్ వస్తువులను వాడకుండా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఓరియంట్ సైసనింగ్ ఏజీఎం నరేందర్, సేఫ్టీ హెడ్ కోటేశ్వరరావు, పర్యావరణ విభాగం ఇన్‌ఛార్జి శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.



నకిలీ విత్తనాల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఖరీఫ్ సీజన్ సమీపిస్తున్న వేళ నకిలీ విత్తనాలు పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని టాస్క్ ఫోర్స్ అధికారిని చంద్రకళ సూచించారు. జిల్లా కేంద్రంలోని పలు దుకాణాలను సోమవారం తనిఖీ చేశారు. దుకాణాలలో విత్తనాల టెస్టింగ్ కోసం హెచ్‌టీ. టెస్టింగ్ కిట్ ఉపయోగించి బీటీ-3 విత్తనాలు లేవని నిర్ధారించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లైసెన్స్ ఉన్న దుకాణాలలోనే విత్తనాలు కొనుగోలు చేయాలని సూచించారు. పత్తి విత్తనాలు విడిగా ఎక్కడైనా అమ్మితే వెంటనే సమాచారం అందించాలన్నారు. విత్తనాలకు సంబంధించి ఎప్పటికప్పుడు వ్యవసాయ అధికారుల సూచనలు, సలహాలు తీసుకోవాలని అప్పుడే పంట దిగుబడి పెరిగే అవకాశం ఉంటుందన్నారు. ఈ తనిఖీలలో సీడ్ సర్టిఫికేషన్ ఆఫీసర్ దుర్గేష్, టాస్క్ ఫోర్స్ ఎస్సై సుధాకర్‌తో పాటు, జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు, ఏడిఏ మిలింద్, ఏఓ ఖాదర్ హుస్సేన్ పాల్గొన్నారు.

భీమారం : నకిలీ పత్తి విత్తనాలను అరికట్టేందుకు వ్యవసాయ శాఖ, టాస్క్‌ఫోర్స్ అధికారులు సోమవారం సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. మండల కేంద్రంలోని పలు విత్తన దుకాణాలతో పాటు గోదాంలలో నిల్వలు, దుకాణ లైసెన్స్, స్టాక్ రిజిస్టర్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా దుకాణాల్లో నిల్వ ఉంచిన విత్తనాలను రాపిడ్ పరీక్షల ద్వారా విత్తన నాణ్యతల పరీక్షించారు. అనంతరం వ్యవసాయ కమీషనర్ కార్యాలయ ఏడీఏ తిరుపతి మాట్లాడుతూ రైతులు కొనుగోలు చేసిన విత్తనాలకు రసీదు తప్పనిసరి పొందాలని సూచించారు. అదేవిదంగా విత్తిన విత్తన మొలక శాతాన్ని గడువు పరిమితిని గమణించాలని సూచించారు. కార్యక్రమంలో చెన్నూర్ ఏడీఏ జె.బాపు, టాస్క్‌ఫోర్స్ అధికారి లచ్చన్న, విత్తన ధృవీకరణ అధికారి శంకరయ్య, మండల వ్యవసాయ అధికారి కె.మార్క్ గ్లాడ్‌స్టన్ పాల్గొన్నారు.

ప్రజావాణిలో ఫిర్యాదుల వెల్లువ

నవతెలంగాణ-కాసిపేట

కాసిపేట మండల పరిషత్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు తమ సమస్యల పరిష్కారంపై దరఖాస్తులను అందించారు. ఆదివాసీ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో ముత్యంపల్లి రేషన్ షాప్‌ను ఎస్టీకి రిజర్వేషన్ చేయాలని వినతిపత్రం అందించారు. ముత్యంపల్లి రేషన్ షాప్ బీసీటీకి కేటాయించారని, గిరిజన ప్రాంతం కావడంతో ఎస్టీకి కేటాయించాలని కోరారు. కాసిపేట మండలంలోని పల్లంగూడ. పంచాయతీలో నిధులపై విచారణ చేయాలని పలువురు యువకులు వినతిపత్రం అందించారు. దీంతో పాటు భూ సమస్యలు ఇతర సమస్యలపై ప్రజావాణిలో వినతిపత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ఎంఏ అలీం, తహసీల్దార్ దిలీప్ కుమార్, ఎంఈఓ ప్రభాకర్, ఎంపీఓ నాగరాజు పాల్గొన్నారు.

బొగ్గు గని కార్మికుల ఘన విజయం

- గనులపై బాణాసంచా పేల్చి సంబరాలు

నవతెలంగాణ-నస్పూర్

బొగ్గు గాని కార్మికుల 11వ వేతన సవరణ చర్చలు సఫలం కావటం ఇది బొగ్గు గని కార్మికుల ఘన విజయమని ఏఐటీయూసీ నాయకులు తెలిపారు. వేజ్ బోర్డ్ సాధించిన ఆనందంలో శ్రీరాంపూర్ ఏరియా లోని అన్ని గనులపై కార్మికులు టపాసులు కాల్చి ఆనందం వ్యక్తంచేశారు. కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలు, బొగ్గు సంస్థలను టోకున ప్రైవేటు సంస్థలకు అమ్ముతున్న సమయంలో, 44 చట్టాలను నాలుగు కోడుల కింద మార్చి కార్మికులను కట్టు బానిసలుగా చేస్తున్న తరుణంలో ఈ జీతభత్యాలు పెరగటం చారిత్రక ఘనవిజయమని నాయకులు తెలిపారు. ఈ 10 సంవత్సరాల కాలంలో నవరత్న కంపెనీలతో సహా ఎల్ఐసి, బీఎస్ఎన్ఎల్, రైల్వేస్, స్టీల్ ఫ్యాక్టరీలలో 10 సంవత్సరాల వేజ్ బోర్డు కాలానికి 15 శాతం కూడా వేతన ఒప్పందం జరగలేదని, జాతీయ కార్మిక సంఘాల సమిష్టి కృషి, సమయస్ఫూర్తి ఆలోచన బొగ్గు గని కార్మికుల ఐక్యతతో ఈరోజు మినిమం గ్యారంటీ బెనిఫిట్ 19శాతం అంటే ఏదేని ఎలాంటి ఇంక్రిమెంట్ లేనటువంటి కొత్త ఉద్యోగికి రూ.6973. 63 పెరిగినవని పేర్కొన్నారు. ఇదే ఉద్యోగికి అలవెన్స్ లతో కలుపుకొని రూ. 10229.26 వరకు పెరిగాయన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాలు, డీపీఈ గైడ్లెన్స్, అధికారుల సంఘం వ్యతిరేకతను ఎన్ని ఉన్నా కార్మిక లోకం ఐక్యతతోనే 11వ వేతన సవరణ అనుకున్న దానికంటే మెరుగ్గా చేసుకోవడం జరిగిందన్నారు. ఇదే స్ఫూర్తితో సింగరేణిలో జరుగుతున్న ప్రైవేటీకరణ కాంట్రాక్టు కరణకు ఆర్థిక దోపిడీకి రాజకీయ ప్రవేశానికి వ్యతిరేకంగా ఏఐటీయూసీ చేసే పోరాటంలో కార్మికులందరూ కలిసి రావాలని వారు గనులపై కార్మికులకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు బాజీ సైదా వీరభద్రయ్య ముస్కె సమ్మయ్య కొట్టే కిష్టరావు మోతుక్కూర్ కొమరయ్య ఉన్నారు.

ప్రారంభమైన జిల్లాస్థాయి సీఎం కప్ పోటీలు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సీఎం కప్ మండల స్థాయి పోటీల్లో విజేతలైన టీములతో జిల్లా స్థాయిలో నిర్వహించే సీఎం కప్ పోటీలు జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల మైదానంలో ఆసిఫాబాద్ కలెక్టర్ బొర్కాడే హేమంత్, అదనపు కలెక్టర్లు రాజేశం చాహత్ బాజ్‌పాయి ఎమ్మెల్యే ఆత్రం సక్కులతో కలిసి ప్రారంభించారు. పోటీల్లో భాగంగా మొదట విద్యార్థులు కవాతు నిర్వహించారు. క్రీడాకారులను పరిచయం చేసుకున్న అధికారులు నాయకులు మాట్లాడుతూ యువత క్రీడల్లో రాణించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం పోటీలో నిర్వహించినట్లు తెలిపారు. క్రీడల్లో ప్రతి ఒక్కరు క్రీడా స్ఫూర్తిని కనబరిచాలన్నారు. జిల్లాస్థాయిలో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపిక కావాలని సూచించారు. సీఎం కప్ పోటీల్లో భాగంగా ఫుట్బాల్, వాలీబాల్, కబడ్డీతో పాటు పలు క్రీడలు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీలు నాగేశ్వరరావు, అజయ్, జిల్లా యువజన క్రీడల అధికారిని మణెమ్మ గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారి సురేందర్, జిల్లా క్రీడల అధికారి మధుసూదన్ పాల్గొన్నారు.

అనుదినం జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
మంగళవారం 23 మే 2023

పారిశుధ్య నిర్వహణను తనిఖీ చేసిన డీఎల్‌పీఓ

నవతెలంగాణ-భీమిని

మండలంలో ఖర్జీ భీంపూర్ పంచాయతీలో సోమవారం బెల్లంపల్లి డీఎల్‌పీఓ, మండల ప్రత్యేకాధికారి ఫణీందర్‌రావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోడ్లు, మురుగుకాల్వలను రోజువారీగా శుభ్రం చేయాలని సిబ్బందికి సూచించారు. సామూహిక ఇంకుడు గుంతల నిర్మాణానికి ప్రతిపాధనలు పంపించాలని తెలిపారు. నర్సరీలో రోజువారీగా రెండు పూటలా నీళ్ల పట్టించాలని పేర్కొన్నారు. ఆయన వెంట ఎంపీఓ షేక్ సఫ్దర్‌అలీ, ఏపీఓ భాస్కర్‌రావు, గ్రామస్తులు ఉన్నారు.

ఇంకుడు గుంత బిల్లు చెల్లించాలి

నవతెలంగాణ- తాండూర్

ఇంకుడు గుంత పూర్తయినప్పటికీ బిల్లు చెల్లించడంలో ఎన్ఆర్ఈజీఎస్ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని రేచిని గ్రామానికి చెందిన బామనపల్లి ఆనంద్ ఆరోపించారు. ఆయన సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఎంపీడీవో ప్రవీణ్ కుమార్‌కు వినతి పత్రాన్ని అందించారు. ఇంకుడు గుంత నిర్మాణము పూర్తయిన గుంత ఫోటోలు, ధ్రువపత్రాలు సమర్పించినప్పటికీ అధికారులు బిల్లు చెల్లించడం లేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రజావాణి కార్యక్రమంలో తహసీల్దార్ కవిత, వ్యవసాయ అధికారి కిరణ్మయి, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ మమత, ఐకెపి ఏపిఎం పూమానాయక్ తదితరులు పాల్గొన్నారు.

మహారాణా ప్రతాప్‌సింగ్ స్ఫూర్తితో ముందుకెళ్లాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

మహారాణా ప్రతాప్ సింగ్ పోరాట స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ ముందుకు వెళ్లాలని మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ అన్నారు. సోమవారం మహారాణా ప్రతాప్ సింగ్ జయంతి సందర్భంగా బొందిలి రాజ్‌పుత్ సమాజ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ యుద్ధ పోరాటాల్లో మహారాణా ప్రతాప్ సింగ్ ఎన్నో విజయాలు సాధించి తన రాజ్యాన్ని రక్షించారని అన్నారు. నేటి యువత ఆయనను స్ఫూర్తిగా తీసుకుని సమాజ అభ్యున్నతికి పాటు పడాలని పిలుపునిచ్చారు. మహనీయుల జీవిత చరిత్రలను తెలుసుకుంటూ వారి ఆశయాలకు అనుగుణంగా నడుచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాజ్ పుత్ సమాజ్ నాయకులు సజిత్ సింగ్, స్వాదావ్ సింగ్, విజయ్ సింగ్ కిరణ్ సింగ్, శక్తి సింగ్, కిషన్ సింగ్ పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌టౌన్ : మహారాణా ప్రతాప్ జయంతి వేడుకలను బిజెపి ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలో మహారాణా ప్రతాప్ విగ్రహం వద్ద ఆయన చిత్రపటానికి బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు సుహాసినిరెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ మేరకు ఆమె మాట్లాడుతూ భారతదేశ చరిత్రలో గొప్ప పోరాట యోధుడు మహారాణా ప్రతాప్ అన్నారు. మహారాణా ప్రతాప్ పోరాటాలు దేశ చరిత్రలో స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఇలాంటి పోరాటయోధుడు దేశంలో జన్మించడం అందరికీ గర్వకారణమన్నారు. మొగలుకు వ్యతిరేకంగా అనేక పోరాటాలు చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో నాయకులు అశోక్‌రెడ్డి, సంతోష్, వెంకట్‌రెడ్డి, సబ్దార్, కాంత, శివకిరన్‌రెడ్డి, గణేష్ ఉన్నారు.

సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

ప్రజలు సైబర్ నేరాలపై జాగ్రత్తగా ఉండాలని ఎస్సై డి.సునీల్ అన్నారు. సోమవారం మండలంలోని ధనోర-బిలో గ్రామస్తులతో మాట్లాడుతూ ఎవరైన గుర్తు తెలియని వ్యక్తులు లక్కీ లాటరీ తలిగిందని ఖాతా నెంబరు తెలపాలని లేదా తాము ఫలానా బ్యాంకు నుంచి మాట్లాడుతున్నామంటూ అకౌంట్ నెంబరు తెలపాలని వంటి కాల్ చేస్తే వివరాలు తెలుపకూడదన్నారు. క్షణాల్లో అకౌంట్ నుంచి డబ్బులు మాయం చేస్తారని సూచించారు. ఇలాంటి వారికి తమ వ్యక్తిగత బ్యాంకు వివరాలను చెప్పకూడదని తెలిపారు. ఈ అవగాహన కార్యక్రమంలో ఏఎస్సై లక్ష్మణ్, భీంరావ్ పాల్గొన్నారు.

సీఎం కప్ ఆటల పోటీలు ప్రారంభం

నవతెలంగాణ-రామకృష్ణాపూర్

తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా పట్టణంలోని ఠాగూర్ స్టేడియంలో జిల్లా స్థాయి సీఎం కప్ క్రీడా పోటీలను సోమవారం జిల్లా కలెక్టర్ బాదవత్ సంతోష్, జెడ్పి చైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి ప్రారంభించారు. సీఎం కప్ ఆటల పోటీలు బుధవారం వరకు కొనసాగుతాయన్నారు. వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, రన్నింగ్ పోటీలు నిర్వహించి గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు ప్రదానం చేస్తామని పేర్కొన్నారు. పోటీలలో జిల్లాలోని అన్ని మండలాల క్రీడాకారులు పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య, మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ మోహన్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ సాగర్‌రెడ్డి, బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు అబ్దుల్ అజీజ్, పట్టణ ఇన్‌చార్జి గాండ్ల సమ్మయ్య, పలువురు కౌన్సిలర్లు, పీడీలు, క్రీడాకారులు పాల్గొన్నారు.

గిరిజనులకు ఉపాధి కల్పించాలి

నవతెలంగాణ-జన్నారం

అడవిలో నివసిస్తున్న దొంగపెల్లి గిరిజనులకు ఉపాధి కల్పించాలని బీజేపీ జిల్లా గిరిజన సంఘం నాయకులు బద్రీ నాయక్, ఆ గ్రామ గిరిజనులు బోర్రె ఎల్లవ్వ, భూమయ్య, నరసయ్య అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఉన్న ప్రెస్ క్లబ్ లో ఆ గ్రామస్తులు మాట్లాడారు. అటవీ శాఖ అధికారులు లేని ఆంక్షలు విధించడంతో జీవనానికి విఘాతం కలుగుతోందని తెలిపారు. తడకలు అమ్ముకోకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. టైగర్ జోన్ నిబంధనల ప్రకారం ఉపాధి కల్పించడంలో అటవీశాఖ అధికారులు విఫలం చెందారన్నారు. అడవిలో దొరికే బొంగులతో తడకలు అల్లుకొని జీవిద్దామంటే అటవీ శాఖ అధికారుల దాడులు ఎక్కువ అయ్యాయన్నారు. ఎలాంటి జీవనాధారం లేక ఇబ్బంది పడుతున్న మాకు తడకలు అమ్ముకునే విధంగా నిబంధనలు సడలించాలని ఆ గ్రామస్తులు కోరారు. లేకుంటే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో దొంగ పల్లి గిరిజన గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

నస్పూర్ విద్యార్థినికి ఐఐఎంలో సీటు

నవతెలంగాణ-నస్పూర్



సీసీసీ నస్పూర్‌కు చెందిన కోడం వర్షినికి ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్ మెంట్ (ఐఐఎం)లో సీటు లభించింది. నస్పూర్ విద్యానగర్ కృష్ణవేణి హైస్కూల్‌లో పాఠశాల డైరెక్టర్ మల్లేతుల రాజేంద్రపాణి సహకారంతో పదవ తరగతి వరకు చదువుకుంది. టెన్త్ లో 9.5 గ్రేడ్ సాధించింది. అనంతరం నిర్మల్ గురుకుల బాలికల కళాశాలలో ఇంటర్ పూర్తి చేసింది. ఇంటర్ పూర్తి కాగానే హైదరాబాద్ మహేంద్రహిల్స్‌లో డిగ్రీలో సీటు వచ్చింది. బీఎస్సీ న్యూట్రీషియన్ చేస్తూ క్యాట్ కోచింగ్ తీసుకుని, 60 శాతం సాధించింది. దీంతో వర్షినికి జమ్మూకాశ్మీర్ లోని ఐఐఎంలో సిటు వచ్చింది. వర్షిని మంచిర్యాల జిల్లా నుండి ఐఐఎంతో సిటు సాధించిన ఏకైకా విద్యార్థినిగా నిలిచింది. తన విద్యార్థినికి ఐఐఎంలో సీటు రావడంపై రాజేంద్రపాణి హర్షం వ్యక్తం చేశారు. వర్షిని తండ్రి రవి శ్రీరాంపూర్‌లో సీనియర్ జర్నలిస్ట్‌గా పనిచేస్తున్నారు, తల్లి సుజాత గృహిణి.

క్రీడాకారులను ప్రోత్సహించేందుకు సీఎం కప్ పోటీలు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

గ్రామీణ యువత క్రీడా రంగంలో రాణించేలా ప్రోత్సహించేందుకు ప్రభుత్వం సీఎం కప్ క్రీడా పోటీలను నిర్వహిస్తోందని కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. సోమవారం ఇందిరా ప్రియదర్శిని క్రీడా ప్రాంగణంలో ఆదిలాబాద్, బోథ్ ఎమ్మెల్యేలు జోగు రామన్న, రాథోడ్ బాపూరావుతో కలిసి కలెక్టర్ సీఎం కప్ జిల్లా స్థాయి క్రీడా పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సీఎం కప్-2023 క్రీడా పోటీల్లో క్రీడాకారులు అనేక పతకాలు సాధించి జిల్లాకు గుర్తింపు తీసుకురావాలన్నారు. అన్ని రంగాలతో పాటు ఆదిలాబాద్ జిల్లాను క్రీడా రంగంలో ముందు వరుసలో నిలపాలని కోరారు. జిల్లాలోని ఎంపీడీఓలు, మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధుల సహకారంతో మండల స్థాయి పోటీలను విజయవంతంగా నిర్వహించడం



జరిగిందన్నారు. అదే స్ఫూర్తితో మూడు రోజుల పాటు నిర్వహించే క్రీడా పోటీలను విజయవంతం చేయాలన్నారు. జిల్లా స్థాయిలో క్రీడాపోటీలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఈ నెల 28 నుండి 30 వరకు హైదరాబాదులో నిర్వహించే రాష్ట్ర స్థాయి సీఎం కప్ పోటీలకు ఎంపిక చేయడం జరుగుతుందని తెలిపారు. మండల స్థాయిలో నిర్వహించిన క్రీడాపోటీలో 5వేల మంది క్రీడాకారులు పాల్గొనగా జిల్లా స్థాయి క్రీడా పోటీలకు 658 మంది అర్హత సాధించినట్లు తెలిపారు. ఎమ్మెల్యే రామన్న మాట్లాడుతూ ప్రతిభావంతులైన క్రీడాకారులను వెలుగులోకి తీసుకొచ్చేందుకే రాష్ట్ర ప్రభుత్వం సీఎం కప్ క్రీడా పోటీలను నిర్వహిస్తోందన్నారు. క్రీడలలో గెలుపు ఓటములు సహజమని, ఉత్తమ ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలవాలని క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కలెక్టర్, ఎమ్మెల్యేలు క్రీడాకారులను పరిచయం చేసుకొని ప్రోత్సహించారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఎల్ఐసికి సంబంధించిన స్టాళ్లను, స్విమ్మింగ్ పూల్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన స్నానపు గదులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ రమేష్ రాథోడ్, డిఎస్పీ ఉమేందర్, మున్సిపల్ వైస్ చైర్మన్ జహీర్ రంజాని, జిల్లా యువజన క్రీడల అధికారి వెంకటేశ్వర్లు, జిల్లా గిరిజన క్రీడల అధికారి పార్థసారథి, జిల్లా ఒలంపిక క్రీడా అధ్యక్షులు బి.గోవర్ధన్‌రెడ్డి, పీఈటిలు, క్రీడాకారులు పాల్గొన్నారు.

దళిత సమాజ అభివృద్ధికి భాగ్యరెడ్డి వర్మ కృషి ఎనలేనిది

- ఆసిఫాబాద్ కలెక్టర్ బొర్కడే హేమంత్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

దళిత జాతికి విద్య అవకాశాలు కల్పించేందుకు విశిష్ట కృషి చేసిన మహనీయుడు మాదరి భాగ్యరెడ్డి వర్మ అని, ఆయన చేసిన కృషి కొనియాడదగిందని కలెక్టర్ బొర్కడే హేమంత్ అన్నారు. సోమవారం ఎస్సీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన భాగ్యరెడ్డి వర్మ 135వ జయంతి వేడుకల్లో అదనపు కలెక్టర్లు రాజేశం, చాహత్ బాజ్‌పాయి, ఎమ్మెల్యే ఆత్రం సక్కుతో కలిసి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ముందుగా భాగ్యరెడ్డి వర్మ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దళిత జాతికి విద్య అవకాశాలు కల్పించేందుకు పాఠశాలలు తెరిచి వారిలో మార్పునకు కృషి చేసిన మహనీయుడు భాగ్యరెడ్డి వర్మ అని అన్నారు. ఆనాటి కాలంలో జోగిని, దేవదాసి వ్యవస్థను నిర్మూలించేందుకు అహర్నిశలు కృషి చేశారని, మహిళల సంక్షేమం దిశగా ఎన్నో కార్యక్రమాలు చేపట్టారని తెలిపారు. భాగ్యరెడ్డి వర్మ ఆశయాలను సాధించి దళితుల అభివృద్ధికి కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పిటిసిలు నాగేశ్వరరావు, సంతోష్, ఎస్సి కార్పొరేషన్ అధికారి సజీవన్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గాధవేని మల్లేష్, షెడ్యూల్డ్ కులాల మానిటరింగ్ సభ్యులు కేశవరావు, గోపాల్, అశోక్, గణేష్, గంగుబాయి, షెడ్యూల్డ్ కులాల సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



సారంగాపూర్‌లో అకాల వర్ష బీభత్సం



నవతెలంగాణ-సారంగాపూర్

మండలంలో ఆదివారం రాత్రి ఉరుములు, మెరుపులతో కురిసిన భారీ వర్షం బీభత్సం సృష్టించింది. నాలుగు ఇండ్లు కూలిపోగా ఆవు మృత్యువాత పడింది. ఆలూర్ గ్రామానికి చెందిన మార్క లస్మవ్వ, దేశెట్టి భీమేశ్వర్ ఇండ్లు, ధని గ్రామంలో శామకుర గంగాధర్ ఇల్లు, బీరవెల్లిలో బ్యాగారి ఆశమ్మ ఇల్లు, గాండ్ల రాజేశ్వర్ ఆవు మృత్యువాత పడింది. గ్రామస్తులు సమాచారం ఇవ్వగా ఆర్ఐ ముంతాజ్ ఇండ్లను సందర్శించి వివరాలు నమోదు చేసుకున్నారు. నష్టపోయిన వారికి పరిహారం అందేలా చూస్తామని రెవెన్యూ అధికారులు తెలిపారు. వీరి వెంట గ్రామ సర్పంచ్‌లు, ఇతర ప్రజా ప్రతినిధులు రవీంద్రనాథ్‌రెడ్డి, సాయికృష్ణ, చిన్నయ్య ఉన్నారు. సాయినగర్, దేవినగర్ తండాలోనూ విద్యుత్ స్తంభాలు వంగిపోయాయి. చెట్లు పడిపోయాయి. ఇండ్ల పైకప్పు రేకులు ఎగిరి పడ్డాయి. విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.





కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యం

మండల కేంద్రంతోపాటు వివిధ గ్రామాల్లో ఆదివారం అర్ధరాత్రి ఈదురుగాలులతో కూడిన అకాల వర్షం బీభత్సం సృష్టించింది. ఎక్కడికక్కడ చెట్లు నెలకొరిగాయి. గాలికి రేకులు ఎగిరిపడ్డాయి. ఆయా గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలలో ఉన్న మొక్కజొన్న, వరి ధాన్యం రాసులు తడిసిపోయాయి. ఆరుగాలం శ్రమించి పండించిన మొక్కజొన్న, వరి ధాన్యం విక్రయానికి తెచ్చిన రైతులు లబోదిబోమంటున్నారు. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసి ఆదుకోవాని వేడుకుంటున్నారు.

విత్తన దుకాణాల అకస్మిక తనఖీ

- ర్యాపిడ్ టెస్ట్ ద్వారా నాణ్యత ప్రమాణాల పరిశీలన



నవతెలంగాణ-జైపూర్

ఖరీఫ్ పంటల సాగును దృష్టిలో పెట్టుకుని వ్యవసాయ, టాస్క్‌ఫోర్స్, విత్తన ధృవీకరణ సంస్థ, పోలీసు అధికారులు సంయుక్తంగా విత్తన దుకాణాలను సోమవారం అకస్మికంగా తనిఖీ చేశారు. నకిలీ విత్తనాలను అరికట్టడంలో భాగంగా మండల కేంద్రంలో గల విత్తన దుకాణాలు, గోదాములు, విత్తన క్రయ విక్రయాలకు సంబందించిన ధృవీకరణ పత్రాలు, నిల్వలు, రశీదు బుక్కులను పరిశీలించారు. ర్యాపిడ్ టెస్ట్ ద్వారా విత్తనాలలో గల నాణ్యత ప్రమాణాలను పరీక్షించారు. వ్యవసాయ కమిషనర్ కార్యాలయం నుండి ఏడీఏ తిరుపతి, చెన్నూర్ ఏడీఏ బాపు, టాస్క్‌ఫోర్స్ అధికారి లచ్చన్న, సీడ్ ఆఫీసర్ శంకరయ్యతో పాటు మండల వ్యవసాయ అధికారి మార్క్‌గ్లాడ్సన్ విత్తణ దుకాణాల తనిఖీల్లో పాల్గొన్నారు. అయితే విత్తనాలు కొనుగోలు చేసినప్పుడు రైతులు విధిగా గడువు తేదీని గమనంలో తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా కొనుగోలు చేసిన విత్తనాల నగదు రశీదు దుకాణాదారుల నుండి విధిగా తీసుకోవాలని సూచించారు. కొనుగోలు చేస్తున్న విత్తనాలు మార్కెట్‌లోకి విడుదల చేసిన సంస్థలు, వారు సరఫరా చేస్తున్న విత్తనాల్లో మొలక శాతం, సరాసరి దిగుబడి తదితర విషయాలపై రైతులు అవగాహన కల్గి ఉండి కొనుగోలు చేయాలని సూచించారు. నాణ్యతా ప్రమాణాల్లో ఏదైన ఇబ్బందులు ఎదురైనప్పుడు వెంటనే వ్యవసాయ శాఖ అధికారులకు తెలియజేస్తూ కొనుగోలు చేసిన దుకాణం, దుకాణాదారు నుండి పొందిన రశీదు వ్యవసాయ అధికారులకు చర్యల నిమిత్తం అందజేయాలని తెలిపారు.

అభివృద్ధిలో వెనుకబడ్డ సిర్పూర్ తాలుకా



నవతెలంగాణ - కాగజ్‌నగర్ రూరల్

సిర్పూర్ నియోజకవర్గం అభివృద్ధికి ఆమడ దూరంలో ఉందని బీజేపీ సిర్పూర్ నియోజకవర్గ నాయకుడు పాల్వాయి హరీష్ అన్నారు. సోమవారం నాయకపు అనుకోడ, అనుకోడ గ్రామాల్లో పల్లెపల్లెకు పాల్వాయి, గడప గడపకు బీజేపీ పాదయాత్ర నిర్వహించారు. గ్రామ సమస్యలపై ప్రజలతో చర్చించారు. ఈ సందర్భంగా హరీష్ మాట్లాడుతూ మారుమూల ప్రాంతాల్లో అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం ఏమాత్రమూ కృషి చేయలేదని, గతంలో పాల్వాయి పురుషోత్తంరావు, పాల్వాయి రాజ్యలక్ష్మి హయాంలో నిర్మించిన ఇళ్లు, కరెంటు తీగలు, బోరింగులే సాక్ష్యం అని తెలిపారు. నియోజకవర్గంలో జరుగుతున్న రహదారుల నిర్మాణాలు కేంద్ర ప్రభుత్వ నిధులతోనే సాధ్యమైందని, కొత్తగా గ్రాంట్లు, నిధులు తీసుకురావడంలో ఎమ్మెల్యే పూర్తిగా విఫలమయ్యారని దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో నాయకులు హరిలాల్, మేచినేని శంకర్, కుందారపు సుమన్, గడ్డం తిరుపతి, గోవింద్ మండల్, ఆశుతోష్ మండల్, అల్లి చిరంజీవి, ఉమ్మెర బాలకృష్ణ పాల్గొన్నారు.

పెన్షన్‌దారులకు మజ్జిగ పంపిణీ



నవతెలంగాణ-జైపూర్

రామారావుపేట్ గ్రామానికి చెందిన ఆసరా పెన్షన్‌దారులకు సర్పంచ్ నామాల సత్యవతి తిరుపతి మజ్జిగ పంపిణీ చేశారు. సోమవారం స్థానికులతో కలిసి స్వయంగా మజ్జిగ పంపిణీ చేసిన ఆమె వేసవి ఎండలు అధికంగా ఉన్నందున ఉదయం సాయంత్రం తప్ప ఎండ పూట బయటకు రాకుండా ఉండటం మంచిదని సూచించారు. వృద్ధులతో పాటు వికలాంగులు, ఒంటరి మహిళలు పెన్షన్ కోసం వచ్చిపోతున్నందున ఎండల తీవ్రతను దృష్టిలో పెట్టుకోవాలని, అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని సూచించారు. ప్రధానంగా వయస్సు పైబడిన వారు, వికలాంగులు జాగ్రత్తలు పాటించాలని తెలిపారు.

ఆయిల్ ఫామ్ మొక్కల పెంపకం, జీలుగు విత్తనాలపై అవగాహన



నవతెలంగాణ - పెంచికల్‌పేట్

మండలంలోని పోతపెల్లి, బొంబాయిగూడ గ్రామాల్లో వ్యవసాయ విస్తరణ అధికారి గౌసియాబేగం రైతులకు జీలుగు విత్తనాలు, ఆయిల్ ఫామ్ మొక్కల పెంపకంపై సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాయితీపై 30 కిలోల జీలుగు విత్తనాల బ్యాగు ధర రూ.843 చెల్లించి రైతులు తీసుకెళ్లాలన్నారు. లైసెన్సు కలిగిన ఫర్టిలైజర్ దుకాణాల్లో మాత్రమే విత్తనాల ప్యాకెట్లు కొనుగోలు చేసేటప్పుడు బార్‌కోడ్, లైసెన్సు నెంబర్, కంపెనీ అడ్రస్ వంటి అంశాలను చూసుకోవాలని, రశీదు తప్పనిసరిగా తీసుకోవాలని పేర్కొన్నారు.

అటవీ అధికారుల దాడులు ఆపాలి

నవతెలంగాణ- జన్నారం

మేదర వృత్తిదారులపై అటవీశాఖ అధికారుల దాడులు ఆపాలని సోమవారం అటవీ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి, ఎమ్మెల్యే రేఖానాయక్ కు మండల మేదరి సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మహేంద్ర సంఘం మండల అధ్యక్షుడు ఎంఆర్ నరసింహారావు మాట్లాడుతూ వెదురు బొంగు ద్వారా తడికలు, గుల్లలు, చాటలు, మొంటెలు, కోళ్ళ గూల్లు మొదలగు గృహోపయోగ వస్తువులు తయారుచేసి గ్రామాల్లో విక్రయిస్తుంటామని తెలిపారు. ముడిసరుకు వెదురు మాత్రమేనని ఇది అడవిలో మాత్రమే లభిస్తుందని కానీ అధికారులు దాడులు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెదురు ద్వారా తయారైన వస్తువులు కొనుగోలు చేసేందుకు అటవీ అధికారుల ఆంక్షలు ఎత్తివేయాలని కోరారు. కార్యక్రమంలో మహేంద్ర సంఘం జిల్లా ఉపాధ్యక్షులు చిలువేరు నరసయ్య, నాయకులు కోడి చుట్ట రాజన్న, పిల్లి మల్లయ్య, సుధీర్ కుమార్ పాల్గొన్నారు.

ప్రజావాణి సమస్యల పరిష్కారాన్ని కృషి చేయాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్ రూరల్

ప్రజావాణి ద్వారా స్వీకరిస్తున్న దరఖాస్తులను పరిష్కరించడానికి ఆయా శాఖల అధికారులు ఎప్పటికప్పుడు కృషి చేయాలని బొర్కడే హేమంత్ అన్నారు. ప్రజావాణిలో భాగంగా ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశం మాట్లాడుతూ ప్రజావాణి ద్వారా వస్తున్న దరఖాస్తుల పరిష్కారం కోసం అధికారులు కృషి చేయాలన్నారు. మండలాల నుండి జిల్లా కేంద్రం వరకు ఫిర్యాదులు రాకుండా చేసినప్పుడే సరైన గుర్తింపు వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు చాహత్ బాజ్పేయి, రాజేశం, జిల్లాలోని అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.